# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా
ఫోన్ (0863) 2293645, 2293862, 2293206.
web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

**సంపాదక వర్గము**
డి.జె. బాలకృష్ణ లాల్
మిస్. పి. ఇందిరాదేవి
డా॥ యమ్. స్వర్ణముఖి
సి.వి. రమణ బాబు
పి.యస్.ఆర్.కె. ప్రసాద్
కె. మురళీ మోహన వర్మ

సంపుటి 38 సంచిక 10
పేజీలు 44
జూన్ 2019

5సం॥ల చందా రూ. 250
2సం॥ల చందా రూ. 120
సంవత్సర చందా రూ. 60
విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ , A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు
గుంటూరు జిల్లా

Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL

**ఈ సంచికలో ............................ ....... పేజీ**

భద్రవాక్యం ....................4
శ్రీబాబూజీ ఉవాచ.................... 6
అమ్మమాట.................... 11
రామాయణంలో స్త్రీ పాత్రలు ....................14
భక్త షేక్ ఫరీద్ ... .... ..... ....................17
నచికేతుడు ....................19
సప్తసప్తాహాల సత్సంగ సమావేశాల - విజ్ఞప్తి 25
బ్రహ్మైవాహమస్మి ....................26
నిజమైన బలం .................... ....................28
భగవంతుని సాన్నిధ్యంలో జనులు పవిత్రులు అవుతారు.........29
శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు....................30
శ్రీకృష్ణ కర్ణామృతము ....................31
పరిప్రశ్న .................... 32
అనుభవ జ్ఞానం ... ... .... ....................34
కైవల్యోపనిషత్ ... ....................36
సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....37
శ్రీమాతాజీ విదేశ పర్యటన కార్యక్రమాలు 39
విష్ణు కథలు ....... .................... ....................41

# భద్ర వాక్యం
- పరాశర ప్రసాద్

## అమృతబిన్దూపనిషద్

**9. శ్లో॥ నిర్వికల్పమనన్తం చ, హేతుదృష్టాన్త వర్జితమ్।**
**అప్రమేయమనాదిం చ. యత్ జ్ఞాత్వా ముచ్యతే బుధః॥**

ప్రాపంచికంగా మానవుడు ఏదో ఒకానొక విషయంలోనో లేదా తాను ఆచరించే కర్మఫలానుభవంలోనో చిత్త ఏకాగ్రత ద్వారా ఇంద్రియ ధ్యాస లేకుండా దేహాన్ని కూడా మరువవచ్చు. అది కేవలం తమో గుణం చేతనే అలా సంభవిస్తోంది సుమా! కాని కొంతమంది సాధకులు తమ సాధనలో దేశ, కాలాదుల ధ్యాస లేకుండా ఆనందాన్ని పొందే సందర్భాలు అనేకం. అంతెందుకు? సద్గురు బోధా శ్రవణం చేసే సందర్భంలో గాని, ఏదైనా పారాయణ చేసే సందర్భంలోగాని, సంకీర్తనలో పాల్గొన్న సందర్భంలోగాని, ధ్యానంలోగాని కొద్ది సమయానికి నిశ్చలత్వాన్ని సాధించవచ్చు. అది కేవలం తాత్కాలికమే. మరుక్షణమే ఆ స్థితి నుండి వెలువడి మనస్సు ప్రాపంచిక విషయాదుల వైపు జారిపోవచ్చు. అది కేవలం సవికల్ప స్థితియే గాని మనస్సులో సంకల్పవికల్పాలు, భావనలు అంతమొందిన స్థితి ఎంతమాత్రమూ కాదు. అది స్పష్టంగా నిర్వికల్ప స్థితి కాదని తేలిపోతుంది. అందువలన అది బ్రహ్మానంద స్థితి కాదు. ఆత్మానంద స్థితి కాదు.

మానవ జీవితంలో పుట్టుట, పెరుగుట, క్షీణించుట అనే మార్పులు అతి సామాన్యము. ఈ మార్పులు కేవలం దేహానికి మాత్రమే పరిమితమైనవి. మానవుడు విచారణ ద్వారా తన దేహం శైశవ, బాల్య యౌవన, కౌమార, వార్ధక్య అవస్థలకు పరిమితమై వుందని తెలుసుకో గలుగుతాడు. కానీ దేహానికి ఆధారమైన తన ఉనికికి కారణమైన నేను అనే ఆత్మస్ఫురణకు మాత్రం పరిమితి లేదు. అది అవస్థలకు అతీతం, జనన మరణాలకు అతీతం, పరిణామ రహితం. దానిని గుర్తెరిగింప జేసేది ఆధ్యాత్మిక చింతన లేక సాధన. ఉదాహరణకు 'నేను చూస్తున్నాను' అనే అంశంలో చూచుట అనే క్రియ పరిమితితో కూడినది. కాని నేను అనే ఉనికి చూడటానికి ముందు, చూచుట అనే క్రియ పూర్తి చేసిన పిమ్మట ఉంది. అందువల అది అనంతము. ప్రాపంచికంగా ప్రతి కార్యానికి ఒక కారణం వుంటుంది. కాని ఆత్మ విచారణకు విచారణ పూర్తి చేసి

ఆత్మానందాన్ని గ్రోలిన మరుక్షణం అది కార్యము కాదు. కారణము కాదు. అందువలన ఆత్మవిచారణ అనేది దృష్టాంత వర్జితము అవుతుంది. అంతేకాదు ఆత్మ స్ఫురణ అనేదానికి ఆదర్శమైన, సమానమైన ప్రమాణం లేదు. అందువలన అది అప్రమేయము. సాధకుడు తాను ఎన్ని విశేషాలను శ్రవణం చేసినప్పటికీ దృష్టాంతాలు, ఉదంతాలు అవగాహనకు వచ్చినప్పటికీ తన అనుభవానికి మించిన దానికి సమానమైన ప్రమాణముంటుందా?

సాధకుడు లౌకిక జీవితానికి విలక్షణంగా ఆత్మస్ఫురణను గుర్తెరిగి అదే ధ్యాసలో తాను పొందే అనుభవం కార్యాకారణాలు లేనిదనే భావన అనాది అని ఎరుక కలిగిన జ్ఞానికి రాకడ, పోకడ ఎక్కడిది? అతడే బుధుడు. అదే జ్ఞానోదయము, ఆత్మానుభూతి. దానిని పొందినవాడు నేను పొందాను, పొందుతున్నాను అన్న ధ్యాస కూడా మరచి బ్రహ్మమై ప్రకాశిస్తున్నాడు.

## పెదనిండ్రకొలను శాఖలో కార్యక్రమాలు

**జూన్ 2019**

17 సోమ - జ్యేష్ట పౌర్ణమి - శ్రీసద్గురుపాదపూజ.

27 గురు - శ్రీగురుదశమి - శ్రీసద్గురుపాదపూజ.

**జులై 2019**

12 శుక్ర - తొలిఏకాదశి - శ్రీసద్గురుపాదపూజ

16 మంగళ - ఆషాఢ పౌర్ణమి (గురు పౌర్ణమి) - శ్రీసద్గురుపాదపూజ

27 శని - శ్రీగురుదశమి - శ్రీసద్గురుపాదపూజ.

# శ్రీబాబూజీ ఉవాచ

(గత సంచిక తరువాయి) - పరాశర ప్రసాద్

3 -2-1980

ఈరోజు ఉదయం శ్రీ బాబూజీ దర్శనార్థము వచ్చిన భక్తులలో ఒకరిని, "ఎప్పుడు వచ్చారు? అంతా క్షేమమేనా?" అని శ్రీ బాబూజీ ప్రశ్నించినప్పుడు, ఆ భక్తుడు 'ఇప్పుడే వచ్చాను' అన్నాడు. సమాధానం కొంచెం పెడసరంగా ఉన్నట్లనిపించింది. కాని ఆయన శ్రీ బాబూజీకి నమస్కారం చేసుకున్నాడు. ఎంతో వినయ విధేయతలతోనే ఉన్నాడు.



శ్రీ బాబూజీ ఆ సమాధానం విని, తమలో తాము నవ్వుకున్నారు. కొంచెంసేపు మౌనం వహించి బోధచేయటం ప్రారంభించారు. "మాట మాట్లాడటంలోనే సొగసు ఉంది. ఏమండీ కులాసాగా వున్నారా? నాన్నగారు వాళ్ళూ బాగున్నారా? అని సంతోషంగా అడిగితే, అడిగేవారికి, వినేవారికి ఎంత ఆనందంగా ఉంటుంది?

అదే ప్రశ్న నిర్లక్ష్యంగా ఎప్పుడు వచ్చారు? మీ అమ్మ మొగుడు కులాసాగా ఉన్నాడా? అని ప్రశ్నిస్తే, అవతల వ్యక్తి యొక్క భావాలు ఎలా ఉంటాయి? ఆలోచించండి. అదే సంస్కారము అని పిలువబడుతుంది. కాబట్టి శబ్దము లేక జిహ్వలో ఎంతో గొప్పతనం వుంది. శబ్దాన్ని జాగ్రత్తగా ప్రయోగించటం ద్వారా ఆకాశము, దాని ద్వారా పంచభూతాలు, వాటి ద్వారా ఇంద్రియాలు, ఆ తర్వాత మనస్సును శుద్ధి చేసుకొనవచ్చును. మంత్రోచ్ఛారణ అంటే శబ్దాన్ని క్రమబద్ధం చేయటం అన్నమాట. అట్టి శబ్దంలో ఎంతో శక్తి ఉంటుంది. ఆ శక్తి ద్వారా అంతఃకరణ శుద్ధి చెంది ఆనందం లభిస్తుంది. ఆనంద స్వరూపునికే శాంతి లభిస్తుంది. ఒక మనిషికి జేబునిండా డబ్బు ఉందనుకోండి. శాంతి వుంటుందా? ఆవ్యక్తి ఇంటిలో ఉన్నా, రైల్వేస్టేషన్‌లో ఉన్నా నిద్రపడుతుందా? ఆ ధనం ఎవరైనా దొంగిలిస్తారని భయం. ఆ తర్వాత ప్రాణహాని జరుగుతుందని భయం. ఏ ధనమూ లేనివాడికి ఏం భయం ఉంటుంది?

నా చిన్నతనంలో నాకు తెలిసిన ఒక మార్వాడీ ఉండేవాడు. అతను వడ్డీవ్యాపారం చేసేవాడు. ధనవంతుడు. అతను సాధారణంగా తన ధనాన్ని చిన్న మూటలోకట్టి బెల్టుక్రింద పైకి కనబడకుండా లోపల భద్రపరచుకునేవాడు. ఆ మూట ఎత్తుగా పొట్టక్రింది భాగంలో కనబడుతూనే ఉండేది. అయితే ఒకనాడు ప్రయాణ నిమిత్తం విజయవాడ రైల్వేస్టేషన్‌కు వచ్చి, రైలు ఆలస్యం అవటంచేత అక్కడ ఫ్లాట్‌ఫారం మీదే నిదురించాడు. పాపం ఆ రోజు మాత్రం డబ్బు మూటలేదు. అయినప్పటికి ధనం ఉందని భ్రమించి దొంగలు ఒక బ్లేడుతో కోసేసరికి రక్తం స్రవించింది. తీరా దొంగలకి డబ్బు దొరకకపోగా, ఆ మార్వాడి కేకలు విని వారిని పోలీసులు పట్టుకున్నారు. చూశారా! ఒక్కొక్కసారి ధనం ఎటువంటి అశాంతిని కలుగజేస్తుందో? నిద్రించేవాడికి తాత్కాలిక శాంతి లభిస్తుంది. సుషుప్తావస్థలో అనుభవించే సుఖం జాగ్రదవస్థలో అనుభవిస్తే ఆనందం మనస్సు వశమైనదన్నమాట.

జ్వరం వచ్చినప్పుడుగాని, శరీరానికి దెబ్బ తగిలినప్పుడుగాని, ఏ రకంగా బాధను అనుభవిస్తాడో, అదేవిధంగా ఆత్మానుభూతిని పొందాలి. ఇది పొందాలంటే సాధన చేయాలి. సాధన చేయటానికి గురుకృప కావాలి. కాబట్టి ఒక గురువుని ఆశ్రయించి ఆయన ద్వారా మనోనిగ్రహం సాధించాలి. దీనికి ధ్యానం ఒక్కటే మార్గం. ధ్యానం చేసేటప్పుడు ప్రక్కన ఒక అలారం గడియారం ఉంచుకోవాలి. దాని శబ్దము వినబడకూడదు. జపమాల కదలకూడదు. ధ్యానంలో స్మరించే మంత్రోచ్చారణ ఆగిపోవాలి. దీనినే భావసమాధి అంటారు.

దీనినుంచి కొంచెం ఎగబ్రాకితే సవికల్ప సమాధి, దాని తర్వాత నిర్వికల్ప సమాధి స్థితిని పొందవచ్చు. మహాత్ములు ఎప్పుడూ సహజ సమాధిలో ఉంటారు. దానిని సాధించాలి. సమాధిలో ఉన్న ఆనందం అనుభవించే వారికే తెలుస్తుంది కాని, మిగిలిన వారికి ఏమి తెలుస్తుంది? అయితే ఆత్మానందాన్ని పొందిన వారి తేజస్సును గుర్తించవచ్చు.

పంచదార యొక్క తియ్యదనం రుచి చూసేవారి ముఖమూ, వేపరసం రుచిచూచిన వారి ముఖమూ ఒకేరీతిగా ఉంటాయా? గురులక్ష్యార్థాన్ని సాధించాలంటే, భక్తి, విశ్వాసము చాలా ముఖ్యము. ఒక పక్షి ఎత్తుగా ఎగరటానికి గల శక్తి దానికిగల రెండు రెక్కల ద్వారా సాధించ గలుగుతుంది. అలాగే సాధకుడు భక్తి, విశ్వాసము ద్వారా

ఆత్మశక్తిని పొందగలుగుతాడు. భగవంతునికి నమస్కరించటానికి కొంతమంది దేహాభిమానంచేత బిడియపడతారు. అయితే అట్టివారే ధూమ పానప్రియులైతే ఒక రైలులో గాని, ఒక బస్సులోగాని ప్రయాణంచేసే సమయంలో తమకు తెలియని వారి వద్దనుండి ఒక సిగరెట్టో లేక అగ్గిపెట్టెనో అడగటానికి సంశయించరు. ఇది మీకు అనుభవమే కదా!" అన్నారు నన్ను చూసి.

"విషయాదుల్లో లేని సిగ్గు, బిడియము భగవంతుని విషయంలో ఎందుకో? అది మనస్సు సమాధాన పరచుకొనటంపై ఆధారపడి వుంటుంది. కాబట్టి గురుదేవుని వద్ద మనస్సు ఎట్టి పరిస్థితుల్లో దాయరాదు. ధృవుడు శ్రీమన్నారాయణమూర్తి దర్శనాన్ని పొందినప్పుడు, 'వత్సా! నీవు ఏది కోరుకున్నా ప్రసాదిస్తాను. ఏమి కావాలో కోరుకో' అని శ్రీమన్నారాయణమూర్తి అంటాడు. అయితే అసంప్రజ్ఞ సమాధిలో ఉన్న ధృవుడు, నేను పొందే ఆనందంకన్నా ఆనందాన్ని ఇచ్చే వస్తువు ఏదీలేదు. కాబట్టి నీ సాన్నిధ్యమే శరణం అంటాడు.

శ్రీమన్నారాయణుడు భక్తులు ఏది అడిగినా ప్రసాదిస్తాడుగాని, ఆయన సాన్నిధ్యాన్ని కోరుకున్నప్పుడు మాత్రం అనేక పరీక్షలు పెడతాడు. అలాగే చివరి పరీక్షగా ధృవుణ్ణి నీ సామ్రాజ్యం యావత్తూ స్వీకరించ మంటాడు. కాని ధృవుడు సామ్రాజ్యాన్ని తిరస్కరిస్తాడు".

శ్రీ బాబూజీ ఇంకా మాట్లాడుతూ ఆత్మవస్తువు పరమాత్మలో కలవాలంటే, దానికి ఏమాత్రం అవిద్య అనబడే ఆవరణ ఉండరాదు. ఏమాత్రం కర్మశేషం ఉన్నా పరమాత్మలో ఐక్యం కావటం సంభవం కాదు. అందుచేతనే శ్రీమన్నారాయణమూర్తి ధృవుణ్ణి, 'నాయనా! ఈ సామ్రాజ్యాన్ని నీకర్మశేషం పూర్తి అయ్యేవరకూ పరిపాలించు. అటు పిమ్మట నా సాన్నిధ్యాన్ని పొందుతావు' అంటాడు" అన్నారు.

శ్రీ బాబూజీ ఉపన్యాసం కొంతసేపు కొనసాగించిన తర్వాత, గుండుగొలను వాస్తవ్యులు ఈశ్వరరాజుగారు యోగాసన ప్రదర్శన చేసే వ్యక్తిని తీసుకొచ్చి శ్రీ బాబూజీకి పరిచయం చేశారు. ఆయన ప్రదర్శన చేయటానికి అనుమతిచ్చారు. భక్తులంతా ఆ ప్రదర్శనని తిలకించారు.

ప్రదర్శన అయిన తర్వాత శ్రీ బాబూజీ మాట్లాడుతూ యోగాభ్యాసము దేహదారుఢ్యానికి మంచిదే, కాని ఆత్మ సందర్శనకు వినియోగపడదన్నారు. యోగాభ్యాసన ద్వారా ప్రాణాయామము,

శ్వాసస్తంభన చేయవచ్చు. కాని ఈ విద్యలన్నీ జ్ఞానాన్ని పొందటానికి వుపయోగపడవు. ధ్యానమనబడే సాధన శరీరానికి అనుకూలంగా వుంటుంది" అన్నారు శ్రీ బాబు.

యోగాభ్యాసము కూడా గురుసాన్నిధ్యంలోనే చేయాలి. లేకపోతే ప్రాణహాని కలగవచ్చు. తలుపులన్నీ మూసుకొని గదిలో ఏకాంతంగా యోగాభ్యాసం చేసే వ్యక్తి, అకస్మాత్తుగా మరణించిన సంఘటన నా బాల్యంలో జరిగింది. అగ్గిపుల్లలు ఎన్ని ఉన్నప్పటికి నిప్పు పుట్టదు. అగ్గిపెట్టె చేత రాపిడి కలిగినప్పుడే నిప్పు పుడుతుంది. అలాగే మనస్సు గురుచరణార విందములపై రాపిడి కలిగించినప్పుడు పుట్టిన ధ్యానాగ్ని, సమస్త పాతకములను హరించి గుణరహితుడౌతాడు. ఆత్మ వస్తువు ఎక్కడో లేదు తనలోనే ఉంది. అంతటా ఉంది. అయితే దానిని గుర్తించలేడు. ఇంద్రియాలతో కూడిన శరీరము కేవలం కర్మను నిర్వహించు యంత్రం. పరిణామంతో కూడినది. ఇంద్రియ సంబంధమైన ఆనందం తాత్కాలికమైనది. కొంతమంది మద్యాన్ని సేవించి ఆనందిస్తారు. అదే కొంచెం ఎక్కువైతే వికారాన్ని పొంది ఆ కృత్రిమ ఆనందాన్ని కోల్పోతారు. కాబట్టి పరమాత్మని ఆశ్రయించినవారికే శాశ్వత ఆనందం కలుగుతుంది. శ్రీ బాబూజీ బాల్యంలో పరిచయమైన ఒక వ్యాపారస్తుని గూర్చిన ఉదంతాన్ని చెప్పారు.

రాజమండ్రిలో ఆంజనేయస్వామి భక్తుడు ఒక వ్యాపారస్తుడు ఉండేవాడు. వ్యాపారం ప్రారంభిస్తూ వచ్చిన లాభంలో సగం భగవంతునికి ఇస్తానంటాడు. వ్యాపారంలో విపరీతమైన లాభం పొందుతాడు. అయితే భగవంతునికి ఇస్తానన్న వాటా వచ్చే సంవత్సరంలో ఇస్తానని వాయిదా వేస్తాడు. ఈ విధంగా ప్రతి సంవత్సరం ఏదో ఒక కుంటిసాకు చెప్తూ భగవంతునికి సమర్పిస్తానన్న ధనాన్ని ఇవ్వడు. సుమారు లక్షరూపాయల వరకు స్వామికి ఋణపడతాడు.

స్వామీ! ఈ లక్షరూపాయల ధనం దాచటానికి నీ దగ్గర ఇనప్పెట్టెలేదుకదా! ధనం నీ దగ్గర ఉన్నా నాదగ్గర ఉన్నా ఏముందీ? అందుచేత నా ఇనుపపెట్టెలోనే జాగ్రత్త చేస్తాను అంటాడు వర్తకుడు.

చూశారా! అంత లాభాన్ని కలగజేసిన భగవంతునికి ధనాన్ని ఇవ్వటానికి ఎలా సంశయించాడో వర్తకుడు? ఎంతకాలం పరమాత్మని మోసం చేయగలడు? ఆ వర్తకుడు వ్యాపారంలో అపారధనాన్ని నష్టపోయాడు. అట్టి స్థితిలో రక్షించమని నన్ను ఆశ్రయించాడు" అని

చెప్పారు శ్రీ బాబూజీ.

"శరణువేడిన వాడిని రక్షించాలికదా. అయితే ఆ వర్తకుడు మాత్రం పరమాత్మని మోసం చేసిన విషయం నాకు తెలియజేయలేదు. కాని నేను మాత్రం ఆ వర్తకునిచేత పరమాత్మునికి ఇవ్వవలసిన లక్షరూపాయల ధనాన్ని ఆంజనేయస్వామి దేవాలయ అభివృద్ధికి ఉపయోగించమని ఒక ఉపాయం చెప్పాను.

ఆ వర్తకుడు పోయిన ధనమంతా తిరిగి ధాన్యవ్యాపారంలో ఆర్జించాడు. ఈ పర్యాయము ఆంజనేయస్వామికి వ్యాపారంలో వచ్చిన ధనంలో కొంత భాగాన్ని వినియోగించాడు".

శ్రీ బాబు ఇంకా మాట్లాడుతూ "నాది కూడ వ్యాపారమే. నా వ్యాపారం కూడా లాభదాయకం అవ్వాలంటే భక్తుల మనస్సును పరమాత్మవైపుకు తిప్పాలి. అప్పుడు భక్తులకు కావలసిన ఇహంలో భోగభాగ్యాలు, పరంలో ఉత్తమగతి ప్రాప్తించిందనుకోండి నాజన్మ ధన్యమైనట్లే కదా!" అన్నారు.

**ఓం సీతాన్వేషణ పండితాయై నమః**

స్వర్ణలంక అన్నమయకోశం అయితే, మైనాక, సురస, సింహిక లనే త్రిగుణాలతో కూడిన సాగరం మనోమయకోశం.

లంకకు ముఖ్యమైన పుష్పకవిమానం ప్రాణమయకోశం అయితే విభీషణుడు, త్రిజటవంటివారు విజ్ఞానమయకోశం.

ఇక అశోకవనం ఆనందమయ కోశం.

ఈ పంచకోశాంతర స్థితయైన జగన్మాతను వెదికి పట్టుకొనే ప్రతిభ ఒకే ఒక్కరి స్వంతం. ఆయనే సీతాన్వేషణ పండితుడైన హనుమంతుడు.

ఆ హనుమత్కాళీ ప్రసాద దేవుని ఆశ్రయిస్తే మనం కూడా పంచకోశాల లోపల వెలిగే జగన్మాతను చేరగలం!

-పాలూరి ప్రసాద్

(గత సంచిక తరువాయి) # అమ్మమాట - జపమాల ప్రసాద

## వివేకవంతమైన విచారణ

సంకీర్తన, పూజ, పారాయణ, జపం, ధ్యానం ..... ఇవన్నీ ఒకదాని కంటె మరొకటి గొప్పవి. కానీ అన్నిటికంటె గొప్పది విచారణ. మానవులు అనేక రకాల విచారణ చేస్తారు. ఇడ్లీ చేయాలంటే రెండు రోజుల ముందు నుండే విచారణ చేస్తారు. మినపప్పు తేవాలి, ముందురోజు నానబెట్టాలి, తరువాత రుబ్బాలి, దానిని మళ్ళీ కొన్ని గంటలు పొంగడానికి వదిలేయాలి, ఆ తరువాత రవ్వ, ఉప్పు కలపాలి; ఇడ్లీ పాత్రలో వేయాలి ... ఇలా చెప్పుకుంటూ వెడితే ఎన్ని పేజీలయినా చాలవు. నడుము నొప్పి వస్తే ఏ జాగ్రత్తలు తీసుకోవాలో కూడా తెలుసు. లౌకిక విషయాల విచారణ పుష్కలంగా చేయగలరు. సెల్ ఫోన్ కొనాలన్నా, కారు, టీ.వి ఇత్యాదులు కొనాలన్నా బోలెడంత విచారణ చేస్తారు.



కానీ, మనని ఈ జనన మరణ మృత్యు సంసారం నుండి ఉద్ధరించే విచారణ ఎంతమంది, ఎంత చేయ గలుగుతున్నారు? ఆ విచారణ ఏమిటి? అది ఎక్కడ దొరుకుతుంది? అది ఎంత సేపు చేయాలి? మనకి కావలసినవి ఈ ప్రశ్నలకి జవాబులు. మనని ఈ సంసార సాగరం నుండి ఉద్ధరించి, తరింపజేసేది కేవలం భగవత్తత్త్వ విచారణ మాత్రమే. భగవంతుడు అంటే కేవలం ఒక రూపానికీ, నామానికీ కట్టుబడినవాడు కాదు. సర్వే సర్వత్రా వ్యాపించి, స్వయం ప్రకాశమై, సర్వ సృష్టిని ప్రకాశింపజేసే ఏ అనంత శక్తి, లేక చైతన్యము ఏదైతే వున్నదో, దానినే మనం భగవంతుడు అంటున్నాము.

**ఈశ్వరో గురురాత్మేతి మూర్తి భేద విభాగినే।**
**వ్యోమవద్ వ్యాప్త దేహాయ దక్షిణామూర్తయే నమః॥**

అంటే ఈశ్వరుడు, ఆత్మ, గురువులలో మూర్తి భేదం వున్నా, సర్వత్రా వ్యాపించి వున్న ఆకాశం ఎలాగ ఒకటిగానే వున్నదో, అవి కూడా ఏకస్వరూపమే అని మనకి శ్రీదక్షిణామూర్తి స్తోత్రం చెబుతున్నది.

కనుక మనం ఆత్మ విచారణ చేసినా, భగవద్విచారణ చేసినా, ఆ మూడూ ఒక్కటే. అవి మనని తరింపచేసేవి. ఆ విచారణ ఎక్కడ దొరుకుతుంది అంటే అది కేవలం సత్యగురువుల దగ్గర మాత్రమే దొరుకుతుంది. సత్పురుషుల వద్ద, సత్సంగములోను దొరుకుతుంది. ఇకపోతే సద్విచారణ ఎప్పుడు చేయాలి? ఎంతసేపు చేయాలి అంటే, ఎప్పుడూ చేయాలి. ఉదయం నిద్ర లేచినది మొదలు, రాత్రి నిద్ర పోయేవరకు తైలధారవలె చేయాలి. అంటే విచారణ చేసుకుంటూ కూర్చోమంటారా అండీ! మేము మా పనులన్నీ మానేసుకోవాలా? అని అడుగుతారేమో! విచారణ చేసుకోమన్నాముగానీ, మిమ్మల్ని మీ పనులన్నీ మానుకుని, సోమరిపోతుగా కూర్చోమని ఎవ్వరూ చెప్పరు. కర్మని ఆచరించి తీరవలసినదే.

కామ్ కరతే రహెూ। నామ్ జపతే రహెూ। రాత్ దిన్ కృష్ణ్‌కా ధ్యాన్ కరతే రహెూ ! - అని మనం పాడుకుంటున్నాంగా. ఏపని చేస్తున్నా కూడా మన మనస్సులో నిరంతరం భగవన్నామ స్మరణ, విచారణ చేసుకుంటూ వుంటే అప్పుడది కర్మలో అకర్మ అవుతుంది. అదే నిష్కామ కర్మ. దానివలన నీకు కర్మఫలం అంటదు. దీనినే శ్రీబాబూజీ మహారాజ్ చెప్పేవారు - అలనాడు గోపికలని కృష్ణపరమాత్మ 'ఓం కృష్ణ ఓం కృష్ణ కృష్ణాయ నమః శ్యామ సుందర మదన మోహన కృష్ణాయ నమః అనే దివ్య మంత్రాన్ని ఉపదేశించి, మీరు విడవకుండా, ఎక్కడ వున్నా, ఏ పని చేస్తున్నా ఈ మహామంత్రాన్ని జపిస్తూ వుండండి, అప్పుడు మీరు నాలోనే వుంటారు, నేను మీలోనే వుంటాను. ఇక మీరు చేసే కర్మల ఫలితం మీకు అంటదు' అని శెలవిచ్చాడు.

అంతే అప్పటి నుంచి గోపికలు పాలు పితుకుతున్నా, ఇంట్లో పనులు చేస్తున్నా, తల దువ్వుకుంటున్నా, ఒకటేమిటి ఇహ ఏ పని చేస్తున్నా కూడా ఆ కృష్ణ నామాన్నే చేస్తూ, కృష్ణ విచారణలోనే వుండిపోయే సరికి, వారికి ఆవులోనూ, ఆవు పొదుగులోనూ, పాలలోనూ, పాల కుండలోనూ, దువ్వెన్నలోనూ, చెట్టులో, ఆకులో, పువ్వులో ఎదుటివారిలో, చివరకు తమలో కూడా వారు కృష్ణుడినే చూశారు! వారి కళ్ళలో కృష్ణుడు నిలిచిపోయి, సమస్తమూ వారికి కృష్ణమయమే అయిపోయింది. ఇది కదా నిజమైన కృష్ణ టీవీ!

శ్రీబాబూజీ ఇంకా ఇలా చెప్పేవారు - 'శ్రీమాతలు ఇంట్లో వంకాయలు తరుగుతూ కృష్ణనామం (భగవన్నామం) అనుకుంటూ తరిగారనుకోండి, ఆ వంకాయలోని పురుగు మీ కత్తిపీటకు బలి అయినా, ఆ కర్మ యొక్క ఫలితం మీకు అంటదు సరికదా, ఆ పురుగుకి కూడా ఉత్తమ జన్మ సంప్రాప్తిస్తుంది'.

ధ్యానం చేసుకునేటప్పుడు మనస్సు అనేక దారుల్లో పరుగెడుతున్నప్పుడు ఆ మనస్సుకి మనం గురుబోధ విచారణను అందించాలి. అప్పుడు దాని చంచలత్వం ఉడిగి ఆ గురుబోధ మీద నిలుస్తుంది. ఇంతకంటే ప్రత్యాహారం ఏముంటుంది? మనం విచారణ చేసుకోవడానికి కాలసిన బోలెడంత బోధని అందించారు శ్రీబాబు. దానిని విచారణ చేయండి. గురు తత్త్వాన్ని, బోధని శ్రవణం చేయండి. దానిని ధ్యానానికి కూర్చున్నప్పుడు మననం చేసుకోండి. చివరికి అది నిదిధ్యాసగా మారిపోతుంది.

మీ హ్యాండ్ బ్యాగ్‌ల్లో అద్దాలు, దువ్వెన్నలు, సెల్‌ఫోన్‌లు పెట్టుకుంటారు. వాటితోపాటు ఒక చిన్న భగవద్గీత, లేదా గురుబోధామృతం పుస్తకమో పెట్టుకోండి. ఖాళీ దొరిగినప్పుడు వాటిని తీసి చదివి, విచారణ చేసుకోండి. అది మీకు మంచి స్ఫూర్తినిస్తుంది. తప్పటడుగు వేయకుండా కాపాడుతుంది. మంచి మార్గం చూపెడుతుంది.

సాధకుడు రాగద్వేషాలు, నిందాస్తుతులు, ప్రియాఽప్రియాలు యిత్యాది ద్వందాలను దాటాలి అంటే అది కేవలం వివేకవంతమైన విచారణ వల్లనే సాధ్యం. దేహాభిమానమనే మూల అజ్ఞానం తొలగాలంటే చేయవలసినది విచారణేగానీ, కేవలం 'అది పోవాలి, అది పోవాలి' అని జపం చేసినంత మాత్రాన పోదు. అహం బ్రహ్మాస్మి, తత్వమసి ఇత్యాది మహా వాక్యాలు కూడా జపం చేసే మంత్రాలు కాదు. నిరంతర విచారణ వలనే ఆ మహావాక్యాలు అనుభవానికి వస్తాయి. అప్పుడే సార్థకత. కనుక మనని మనం తెలుసుకునే నిజ తత్వ విచారణ చేయండి. అందుకు కావలసిన అఖండ భక్తిజ్ఞాన వైరాగ్యములను, అఖండ ఆయురారోగ్యములను, ప్రసాదించి గురుపాదుకలు సర్వదా కాపాడుగాక! సుఖీభవ! సుఖీభవ!!

# రామాయణంలో స్త్రీ పాత్రలు

- సుషమ్నా ప్రసాద

విశిష్ఠము, ఉదాత్తము అయిన భారతీయ ధర్మము, సంస్కృతి, సంప్రదాయములను ప్రతిబింబింపజేసే మహోత్కృష్ట గ్రంథరాజము శ్రీమద్రామాయణము.

రామాయణమనే మహిమాన్వితమైన, అమూల్యమైన మణిమాల యుగయుగాలకు, తరతరాలకు శాంతిని, క్రాంతిని ప్రసాదిస్తుంది. మానవాళిని ధర్మపథంలో నడిపించి, ఆదర్శాలకు అద్దం పట్టే ఆదికావ్యము శ్రీమద్రామాయణము. ఇది కేవలము ఆదికావ్యమే కాదు, ఆద్యంతాలులేని సనాతన ధర్మ, సత్య శాంతులతో ప్రకాశించే పరిమళ సుమమాలిక రామాయణము. మానవాళికి లౌకిక, పారమార్థిక లక్ష్యములను నిర్దేంశించేవి వేదములు. అవి అపౌరుషేయములు. వేదములలో నిర్దేశించిన సత్య ధర్మాలను ఆకర్షణీయమైన, సులభశైలిలో సామాన్యమానవాళికి సంస్కృతభాషలో అద్భుతమైన వరంగా ప్రసాదించిన మహాతపస్వి, త్రికాలజ్ఞాని శ్రీవాల్మీకి మహర్షి దీనినే 'వేదః ప్రాచేత సాదాసీత్ సాక్షాద్రామాయణమాత్మనా' అంటే వాల్మీకి ముని పుంగవునిచే ఆ వేదము సాక్షాత్ రామాయణమై, ఈ భువియందు వెలసినదని సూక్ష్మార్థము.

పద్మసంభవుడైన బ్రహ్మముఖము నుండి వేదములు, వల్మీక సంభవుడైన వాల్మీకి మహర్షి వాక్కునుండి రామాయణము వుద్భవించినవి. బ్రహ్మ చతుర్ముఖుడు, వాల్మీకి చతురవచనుడు. బ్రహ్మ లోక విధాత. వాల్మీకి శ్లోక విధాత. బ్రహ్మమానస పుత్రుడైన నారదమహర్షి ప్రేరణతో, ఆది కావ్యమైన రామాయణ రత్నదీపికను, రసరమ్యమైన కావ్యదీపికను మానవ జాతి సముద్ధరణకై ప్రజ్వలింపజేసిన ఆదికవి వాల్మీకి మహర్షి. శ్రీరామ చరితమును కావ్యరూపంలో రచించడానికి, విధాతచే ప్రేరేరింప బడి, ఆ రామాయణ మహాకావ్యమును లోకములో నదులు, గిరులు వున్నంత కాలమూ విరాజిల్లుతూ, శాశ్వత కీర్తిని పొందెదవు గాక!' అని ఆశీర్వదించాడు. **'యావత్ స్థాస్యంతి గిరయ సరితశ్చ మహీతలే, తావత్ రామాయణ కథా లోకేషు ప్రచరిష్యతి॥'**

అలా దివ్య ప్రేరణతో, వాల్మీకి మునిపుంగవుడు యోగాసీనుడై తన అంతర్చక్షువులతో రామచరిత ఘట్టమును, దృశ్యములను దర్శించి, ఆ దివ్య స్ఫూర్తితో, ఆదికావ్య అంకురార్పణ చేశాడు.

వేదం సనాతనమైతే, ఆ సనాతన ధర్మ ప్రదర్శనమే రామాయణ మహాకావ్యంగా రూపొందింది. దివి నుండి భువిపై వర్షించిన నాదాత్మక వేదామృత తుషారమే రామాయణం. రామాయణంలోని ప్రతి అక్షరము, పాప వినాశము చేసే పవిత్రమైన వాల్మీకి వాక్సుధ. వాల్మీకి రామాయణం ఆరు కాండలలో, 24వేల శ్లోకాలతో రచింపబడినది. కాండ అంటే జలము అనే అర్థం కూడా వున్నది. జలం యొక్క లక్షణం శుద్ధి చేయడం. అంటే రామాయణ పఠనం, శ్రవణం, మననం మానవాళిని శుద్ధి చేసి, ధర్మపథంలో, ప్రగతిమార్గంలో నడిపిస్తుంది. రామాయణమనే అమృత సాగరంలో కెరటాలను స్పృశించి, చవిచూసి కేరింతలు కొట్టేవారు కొందరయితే, ఆ జలనిధిలో జలకమాడి నర్తించేవారు మరికొందరయితే, అగాధ సాగరంలో ఈదుకుంటూ, లోతుకు వెళ్ళి, ఆణిముత్యాలను అందుకునేవారు మరికొందరు. అందరూ భాగ్యశాలులే! మహానుభావులే!!

'నా నృషి కురుతే కావ్యం' అన్నారు. అంటే ఋషి కానివాడు కావ్యం వ్రాయలేడని అర్థం. 'వాక్యం రసాత్మకమ్ కావ్యం' అన్నారు. అంటే రసోద్దీపితమైన వాక్యమే కావ్యము. సాహిత్యము, ప్రభు సమ్మితము, మిత్ర సమ్మితము, కావ్య సమ్మితమని మూడు రకాలుగా విభజించారు. ఇది చేయండి, ఇది చేయవద్దు అని ప్రభువులా నిర్దేశించే వేదములను ప్రభు సమ్మితము అన్నారు. కథల ద్వారా మిత్రునిలా హితమును బోధించే పురాణములను మిత్ర సమ్మితమన్నారు. కాంతలా సున్నితంగా, హృదయాన్ని స్పృశించేటట్లు, లాలనగా హితము చెప్పే సాహిత్య ప్రక్రియను కాంతా సమ్మితమన్నారు. రామాయణము యావన్మానవాళికి చెందిన మహత్తర కావ్యము.

రామాయణమునకు మూడు పేర్లున్నాయి - 1. రామాయణము, 2. సీతాచరితము, 3. పౌలస్త్య వధ.

వాల్మీకి మహర్షి శ్రీరామచంద్రునకు సమకాలీకుడు. ఎందుకంటే నిండుచూలాలైన సీతమ్మతల్లి, ఆయన ఆశ్రయాన్ని పొంది, వాల్మీకి మహర్షి ఆశ్రమంలోనే లవకుశలకు జన్మనిచ్చి, వారిని రఘువంశ

వీరులుగా తీర్చిదిద్దింది. ఆ చిన్నారుల చేతనే రామాయణాన్ని గానం చేయించాడు వాల్మీకి ముని కోకిల. హిమవన్నగమంత మహోన్నతము, అమృతసాగరమంత అగాధము. గంభీరమైన మహాతపస్వినికి, యోగినియైన పవిత్రమాతృమూర్తికి ఆశ్రయమిచ్చిన వాల్మీకి మహర్షి భాగ్యమే భాగ్యము! అందుచేతనే వాల్మీకి మహర్షి రూపకల్పన చేసిన, స్త్రీమూర్తి అపూర్వకావ్య సుందరి. 'న భూతో న భవిష్యతి.'

రామాయణంలో ధర్మత్రిపుటి వుంది. వ్యక్తి ధర్మము, కుటుంబ ధర్మము, సంఘ ధర్మము. మూడు ధర్మాలను ఆదర్శప్రాయంగా పాటించిన ధర్మావతారము శ్రీరామచంద్రుడు. రథ గమనానికి రెండు చక్రాలు ఎంత ఆవశ్యకమో, జీవిత గమనానికి, కథా గమనానికి స్త్రీ పురుషులు ఇద్దరూ ప్రధాన పాత్రలే. ఇద్దరూ పరిపూర్ణ సంసారిక జీవితానికి ప్రధాన ప్రతిపత్తిగలవారే. అందులో హెచ్చుతగ్గులు లేవు. పురుషాధిక్య ప్రపంచంలో స్త్రీ పురుషునికి నీడవంటిదని భావించడం పొరపాటు. సృష్టి కార్యంలో, సంసార బాధ్యత నిర్వహించడంలో ఇద్దరికీ సమాన ప్రతిపత్తి వున్నది. సత్వ రజ తమో గుణాలు కలది స్త్రీ అని కొంతమంది నిర్వచించారు. ఈ నిర్వచనం పాక్షికతను సూచిస్తోంది. స్త్రీలే కాదు పురుషులు కూడా త్రిగుణాత్మక స్వరూపులే.

అలాగే పురుషుడు అంటే పురమునందు నివసించేవాడు అని అర్థం. ఈ కోణంలో కూడా ఇద్దరికీ వ్యత్యాసం లేదు. ఎందుకంటే స్త్రీ కూడా దేహధారియే. కనుక కావ్యంలో కూడా నాయికా నాయకులిద్దరూ సమాన పాత్రను పోషిస్తారు. హెచ్చుతగ్గులు లేవు.

ఇద్దరి పాత్ర పటిష్టమైనది. సమాన ప్రాధాన్యత కలదని సూచించడానికే మనం పార్వతీ పరమేశ్వరుడు, లక్ష్మీనారాయణుడు, సీతారాములని పేర్కొంటాము. అన్నింటిలో మాతృమూర్తి పేరే ముందున్నది. అలాగే మాతృదేవో భవ! పితృ దేవో భవ! అని అమ్మకే ముందు ప్రాముఖ్యత వున్నది. సీత లేని రామాయణమే లేదు. అందుకే శ్రీరామాయణంలోని స్త్రీ పాత్రల గురించి కూలంకషంగా తెలుసుకోవాలి.

-సశేషం

(గత సంచిక తరువాయి) 

# భక్త షేక్. ఫరీద్

- మురళీ

నీళోబాయి 'నాయనా! నీవు ఆచార్యుని ధర్మోపదేశము పొందకుండా నీవెంత తపస్సు చేసినా ప్రయోజనం వుండదు. కనుక నీవు కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యములకు లోనుకాకుండా, సత్యగురువుని ఆశ్రయించి, జ్ఞానోపదేశాన్ని పొందు. అట్టి ఆచార్యుడు గయలో శ్రీ జ్ఞానానంద స్వామిగా వున్నారు. నీవు వెళ్ళి వారిని ఆశ్రయించు' అని చెప్పినది.

షేక్ఫరీదు 'తల్లీ! పెద్దలు తల్లిని మించిన దైవము లేదు అని చెబుతారు. అట్టి ఆర్యోక్తి నీ యెడల సార్థకం అయినది. ఇట్టి నీ మహిమను నేను తెలుసుకోలేక ఎన్నో మార్గాలు అనుసరించాను. కానీ శ్రీహరి దర్శనం పొందలేకపోయాను. నీ ఆజ్ఞ, శ్రీహరి ఆజ్ఞ ఒక్కటే అయినది. సద్గురువును ఆశ్రయించెదను. నన్ను ఆశీర్వదించు' అని తల్లి పాదాలకు సాష్టాంగ ప్రణామములు చేసి, గయ క్షేత్రానికి బయలుదేరి వెళ్ళాడు.

మార్గములో అనేక పుణ్యక్షేత్రాలను దర్శిస్తూ చివరికి గయ చేరుకుని, శ్రీ జ్ఞానానంద స్వామి ఆశ్రమం చేరుకున్నాడు. స్వామి షేక్ఫరీదును చూస్తూనే, 'నాయనా! ఎన్ని రోజులకు వచ్చావు? నీవు గొప్ప తపస్సు చేశావు. నిన్ను మించిన భక్తుడు లేడు' అని చెప్పి అతనిని ఆదరించి, ఉపదేశం చేశారు.

శ్రీ జ్ఞానానంద స్వామి ఉపదేశాన్ని పొంది, శ్రీకృష్ణ నామాన్ని జపిస్తూ, షేక్ఫరీద్ ద్వారక చేరుకున్నాడు. అక్కడ ద్వారకావాసుని ప్రార్థించి ఆయన దర్శన భాగ్యాన్ని పొందాడు. శ్రీకృష్ణ పరమాత్మ 'వత్సా! నీ భక్తి అచంచల మైనది. నీ హృదయం నిర్మలమైనది. నీవు నన్ను ప్రసన్నుడను చేసుకున్నావు. నేను సదా నీ హృదయంలో నివసిస్తాను. నీకు శుభమగుగాక!' అని ఆశీర్వదించాడు.

అక్కడ నుండి జగన్నాథ క్షేత్రానికి వెళ్ళి శ్రీ జగన్నాథుని దర్శనం చేసుకుని, తీర్థ ప్రసాదములు తీసుకుని తన తల్లిదగ్గరకు చేరుకున్నాడు. తన తల్లికి ప్రదక్షిణ నమస్కారాలు చేసి, 'తల్లీ! నీ ఆదేశానుసారము గయ క్షేత్రానికి వెళ్ళి, జ్ఞానానంద స్వామి దగ్గర శ్రీకృష్ణ మంత్రోపదేశం పొంది,

ద్వారకకు వెళ్ళి, ద్వారకావాసుణ్ణి దర్శించి, వారి కృపకు పాత్రుడనై తిరిగి నీ సన్నిధికి వచ్చాను' అని చెప్పాడు.

ఆ దేశపు రాజు సంతాన హీనుడై కుష్ఠు రోగముతో బాధ పడుతున్నాడు. షేక్ఫరీదు మహిమను తెలిసికొని, ఆ రాజు అతనిని శరణుపొంది తన బాధను మాన్పమని ప్రార్థించాడు. షేక్ఫరీదు 'రాజా! నీ బాధలన్నీ తొలగిపోతాయి' అని ఆశీర్వదించగానే అతని కుష్ఠురోగము మాయమై, అతనికి బంగారు ఛాయ వంటి దేహము లభించింది.

ఒకరోజు రుక్మిణీదేవి షేక్ఫరీద్కు స్వప్నంలో దర్శనమిచ్చి, 'నాయనా! సంతానహీనుడైన ఆ రాజును అనుగ్రహించు. అతని హృదయము నిర్మలమైనది' అని చెప్పినది. మరునాడు షేక్ఫరీద్ రాజును సమీపించి, భగవదార్చన చేసి, ఒక తులసీదళమును, తీర్థ ప్రసాదములను ఆ రాజుకు రాణికి ఇచ్చాడు. కొలది కాలములోనే ఆ రాణి గర్భవతియై ఒక చక్కని కుమారుణ్ణి ప్రసవించింది.

షేక్ఫరీద్ ఇలా లోకులకు ఎన్నో ఉపయోగకరమైన సేవలను చేసి, అంత్యకాలములో ఆ వైకుంఠాన్ని చేరుకున్నాడు.

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ చిరకాల భక్తులు, ఆశ్రమ స్థిర నివాసులు అయిన మావులేటి శ్రీకృష్ణ శకుంతలమ్మగారు 6-5-2019 సోమవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 85 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరికి ఆత్మశాంతిని ప్రసాదించెదరు గాక!

వీరి కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

# నచికేతుడు

(గత సంచిక తరువాయి)

- పరాశర ప్రసాద్

నచికేతుడు తనకు మూడవ వరంగా మానవుడు చనిపోయిన తరువాత ఆత్మ ఏమవుతుంది? జీవుడి సంగతి ఏమిటి? అని ప్రశ్నించిన దానికి సమాధానంగా యమధర్మరాజు మాట్లాడుతూ "నువ్వు అడిగిన ప్రశ్న దేవతలకు సహితం తెలియనిది. అతి రహస్యమైనది. అది జ్ఞానోపదేశము. దానిని పొందటానికి అధికారియై వుండాలి. ఇంకా ఏదైనా కోరుకో. ఆత్మ తత్వం మినహా నువ్వు ఏది అడిగినా ఇవ్వడానికి సంసిద్ధుడనై వున్నాను" అన్నాడు.

నచికేతుడు యమధర్మరాజు ఇవ్వజూపిన ప్రలోభాలన్నిటిని తిరస్కరించి, ప్రాపంచిక సుఖాలపై తనకున్న నిరసనను తెలియజేసి, ఆత్మజ్ఞానంపై తనకున్న ఆసక్తి, జిజ్ఞాస వ్యక్తం చేసిన తరువాత యమధర్మ రాజు జ్ఞానోపదేశాన్ని ప్రారంభించాడు.

యమధర్మరాజు మాట్లాడుతూ "మానవుడు తన భవిష్యత్తుని నిర్ణయించుకోవడానికి రెండు మార్గాలు వున్నాయి. ఒకటి శ్రేయో మార్గం. రెండవది ప్రేయో మార్గము. శ్రేయో మార్గము పరమ పురుషార్థ సాధనము. శాశ్వతమైనది. ప్రేయో మార్గము అశాశ్వతమైన ఫలితాన్నిచ్చేది. అనిత్యమైనది. వివేకవంతుడైన మానవుడు శ్రేయో మార్గాన్నే ఎన్నుకుంటాడు. బ్రహ్మము హేతువాదానికి అందదు. చాలా నిగూఢమైనది. అందువలననే మానవులు ఆత్మ తత్త్వాన్ని వినడానికి ఆసక్తి కనబరచరు. పోనీ ఆసక్తి కనబరచినా దానిని ఉపదేశించే సమర్థులు దొరకడం దుర్లభం. పోనీ ఉపదేశించేవారు లభించినా, ఆ ఉపదేశాన్ని శ్రద్ధగా శ్రవణం చేసి, మననం. విచారణ చేసేవారు అరుదు.

ఆత్మదర్శనం బహు దుర్లభం. కానీ ధ్యానశీలుడైన సాధకుడు, ధీరుడు, ఇంద్రియ సంయమనం సాధించినవాడు, శబ్ద, స్పర్శాది విషయాలకు స్పందించనివాడు,చిత్తశుద్ధి కలవాడు ఆత్మతత్వాన్ని అవగాహన చేసుకోగలుగుతాడు. ఆత్మ తత్త్వాన్ని అందుకోవడానికి దోహదం చేసేది ఓంకారము. ప్రణవము. ప్రణవోపాసన ద్వారా సోపాధిక నిరుపాధిక బ్రహ్మముల అభేద దృష్టి కలుగుతుంది. ఆత్మ వస్తువు

బహిర్ముఖమైన మనస్సు ద్వారా ఇంద్రియాల ద్వారా, బాహ్య వస్తువుల ద్వారా సాధకుడు దాని పరిచయాన్ని పొందుతున్నప్పటికీ, దానిని గుర్తించే స్థితిలో వుండడు. అయితే అదే మనస్సు అంతర్ముఖమైన సాధకుడు అవస్థాత్రయ సాక్షిగా వుంటాడు. వాడు దుఃఖ రహితుడు. బంధ విముక్తుడు. ఆనందానుభూతిని పొందుతాడు. మనోవికారాలు లేని సాధకుడు రాగద్వేషాలు, సుఖదుఃఖాలు, దూషణభూషణలకు అతీతుడై, బంధవిముక్తుడై, ఆత్మసందర్శనాన్ని పొందుతాడు. ఈ దేహం నశించిన తరువాత ఘటాకాశము, మహాకాశములో లీనమైనట్లు జీవాత్మ పరమాత్మకు భిన్నము కాదని తేటతెల్లమవుతుంది. ఆత్మ తేజస్సు స్వప్రకాశమైనది. సూర్యచంద్రాదులు, నక్షత్రాలు ఆత్మతేజస్సు ద్వారానే ప్రకాశిస్తున్నాయి. మరణించిన జీవులందరూ వారి వారి కర్మఫలాలను అనుసరించి యోగ్యత కల ఉపాధులలో ప్రవేశిస్తారు. సర్వవ్యాపకమైన ఆత్మవస్తువు ఆయా ఉపాధుల క్రియాత్మకతకు తోడ్పడుతూ జీవాత్మగా వ్యవహరిస్తుంది. దేహము నశిస్తుంది, కాని జీవాత్మకు నాశనము లేదు. అందువలన నచికేతా! నేను అందజేసిన జ్ఞానమార్గంలో పయనించడానికి సమర్థుడైన సద్గురు మూర్తిని ఆశ్రయించి ఆయన అనుగ్రహానికి పాత్రుడవై, ఆత్మజ్ఞానాన్ని పొందు" అని యమధర్మరాజు నచికేతునికి బోధచేసి, యమ లోకం నుండి భూలోకంలోని అతని తండ్రి వద్దకు తిరిగి పంపించాడు.

-సశేషం

# శ్రీమాతాజీ ఆశ్రమేతర కార్యక్రమములు

**జూన్ 2019**

1శనివారంనుండి - 6 గురువారం వరకు శ్రీ కాళీవనాశ్రమం, శ్రీ అవధూతనిలయం పావులూరులో పరమపూజ్య శ్రీశ్రీశ్రీ అవధూతేంద్ర సరస్వతి స్వామి వారి వార్షిక పుణ్యారాధన పాంచాహ్నిక మహోత్సవాలలో శ్రీ మాతాజీ పాల్గొంటారు.

9 ఆదివారం - నందికొట్కూరు, కర్నూలుజిల్లా, శ్రీ హనుమత్కాళీప్రసాద ఆశ్రితాశ్రమ వార్షిక మహోత్సవంలో శ్రీమాతాజీ వారు ప్రసంగిస్తారు.



సామర్లకోట చాళుక్య కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయ ప్రాగంణంలో హరేరామ నామ సప్తాహంలో పాల్గొన్న శ్రీమాతాజీ



సామర్లకోటలో ఉచిత వైద్యశిబిరం ప్రారంభిస్తున్న శ్రీమాతాజీ మరియు వైద్యబృందం.



సామర్లకోట శోభాయాత్రలో పాల్గొన్న శ్రీమాతాజీ



సామర్లకోటలో శ్రీమాతాజీవారిని సత్కరిస్తున్న ఆర్యవైశ్యసంఘ
ప్రెసిడెంట్ కటకం సృజన్ దంపతులు మరియు కుటుంబ సభ్యులు



బెంగుళూరు సత్సంగ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీమాతాజీ




హైదరాబాద్‌శాఖ బాబూభక్త సమాజ్‌వారు మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం



భీమవరం శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయం (త్యాగరాజ భవన్)లో సామూహిక కుంకుమ పూజలు నిర్వహిస్తున్న శ్రీమాతాజీ



## శ్రీ బాబూజీ మహరాజ్ అనుగ్రహముతో
## శ్రీ చంద్ర కాళీ ప్రసాద మాతాజీ వారి పర్యవేక్షణలో జరుగనున్న 'హరేరామ నామ సంకీర్తన, సత్సంగ సప్త సప్తాహాలు'

పైన వివరించిన కార్యక్రమాలు శ్రీఅన్నవరం శ్రీ సత్యదేవుని సమక్షంలో ప్రారంభమై, పంచారామాలలో సప్తాహములు చేసుకుని చివరిగా శ్రీకాళీవనాశ్రమంలో సంపూర్ణం చేయబడతాయి. ఈ విషయం భక్తులందరికి కరపత్రములు (పేంప్లెట్స్) ద్వారా తెలియపరచటమైనది.

కార్యక్రమ వివరములు : తె జా 4 గం.లకు సుప్రభాతం; 4గం 30 ని.లకు ప్రార్థన; 9గం.లనుండి 10 గం.ల వరకు శ్రీశ్రీనివాస రామానుజదాసు గారి ప్రవచనము;11 గం.లకు మరియు సాయంత్రం 6 గం.లకు శ్రీ మాతాజీ మరియు మహాత్ముల అభిభాషణము ఉంటాయి. ఈ సప్తాహాలలో అఖండ హరేరామ నామ సంకీర్తన శ్రీ శివాజీ, కామేపల్లివారి ఆధ్వర్యంలో జరుగును.

సప్త సప్తాహముల వివరములు : 1. ది.23.3.2019 నుండి ది,30.3.2019 వరకు అన్నవరం శ్రీ సత్యన్నారాయణ స్వామి వారి ఆలయ ప్రాంగణంలో ; *2. ది. 24.04.2019 నుండి ది. 01.05.2019 వరకు చాళుక్య కుమారారామం, శ్రీ బాలా త్రిపుర సుందరీ సమేత భీమేశ్వర స్వామి, సామర్లకోట;* 3, ది. 20.05.2019 నుండి ది.27.05.2019 వరకు భీమారామం, మాణిక్యాంబ సమేత శ్రీ భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం ద్రాక్షారామం ; 4. ది.05.08.2019 నుండి ది.12.08.2019 వరకు సోమారామం, ఉమాసోమేశ్వర జనార్ధనస్వామివార్ల దేవస్థానం భీమవరం; 5. ది.08.09.2019 నుండి ది.15.09.2019 వరకు క్షీరారామం, శ్రీ పార్వతీ సమేత క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం, పాలకొల్లు; 6.ది.18.10.2019 నుండి ది.25.10.2019 వరకు అమరారామం, శ్రీ బాలా చాముండేశ్వరి సమేత శ్రీ అమరేశ్వరస్వామి ఆలయం ప్రాంగణం అమరావతి; మరియు 7. ది.15.11.2019 నుండి ది.22.11.2019 వరకు శ్రీగురు ఆరామం, శ్రీ కాళీవనాశ్రమం (నంబూరు)లో నిర్వహించబడును.

భక్తులందరూ బహు సంఖ్యాకంగా విచ్చేసి, ఈ కార్యక్రమాలను జయప్రదం చేయమని ప్రార్థిస్తున్నాము. భారీ ఎత్తున జరిగే ఈ కార్యక్రమాలు ఎంతో వ్యయ ప్రయాసలతో కూడినవి. కావున భక్తులు ఈ విషయాన్ని గుర్తించి, ధన రూపంలోను, అమూల్యమైన సేవలరూపంలోను తమ సహాయ సహకారాలను అందించమని భక్తులను ప్రార్థిస్తున్నాము. భక్తులు ఇచ్చే విరాళాలకు ఐ.టి యాక్ట్ 80 జి రాయితి లభిస్తుందని తెలియజేస్తున్నాము.

పూర్తి వివరాలకు ట్రస్ట్ ఆఫీస్ 0863 - 2293564;

కె.మురళీమోహన వర్మ సెల్ - 93983 34345 మరియు

కుమార స్వామి రాజా సెల్ - 93465 35357లను సంప్రదించగలరు.

# బ్రహ్మైవాహమస్మి

-రమణ ప్రసాద్

(శ్రీ మాతాజీ ప్రసంగాల నుండి)

సర్వాధిష్ఠాన చైతన్య ప్రభువులైన శ్రీ గురుదేవులు మనం ఈ ప్రపంచంలో ఎక్కడ కొట్టుకుపోతామో, 'నువ్వు ఇది కాదు, అదియై వున్నావు' అని మాటి మాటికి గుర్తింపజేసేటందుకై ఈ ధనుర్మాస కార్యక్రమాలు మనకు ప్రసాదించారు. తత్త్వపూరితంగా రుక్మిణీ కళ్యాణ ఘట్ట ప్రవచనాన్ని విన్నాం. మనందరికీ శ్రవణ మంగళమైనది. ఈ కలికాలంలో వ్రతం చేసి తాను తరించి, తరింపజేసిన గోదాదేవి అనుభూతిని పాశురాల ద్వారా పొందింపజేసి మన పాపాలను హరించారు శ్రీ గురుదేవులు.

ఈ సంసారం సుఖ దుఃఖ మిశ్రితమై ఉన్నది. ఈ సంపాదనలు, క్వాలిఫికేషన్స్, నేను చదువుకున్నాను, నేను కోటీశ్వరుడిని, నేను గొప్పవాడిని అనుకుంటే దానివల్ల శాశ్వతానందం కలుగుతోందా? ఫ్లైట్‌లో వెళ్తున్నావు. పైలట్ 'బయట వాతావరణం అనుకూలంగాలేదు, బెల్ట్ పెట్టుకోమం'టే మనం అనుభవించే ఆనందం ఎగిరిపోతుంది. ఆ ఫ్లైట్ లో ఉన్న అందరూ ఎవరు ఏ దేవుణ్ణి విశ్వసిస్తే ఆ దేవుడి ఉపాసన చేస్తారు. సౌత్ ఆఫ్రికాలో మమ్మల్ని బంగారు గనులలోకి తీసుకు వెళ్ళారు. అక్కడ అంతా చీకటి. నేల రాళ్ళమయం. తాత్కాలిక లిఫ్ట్‌లు అమరుస్తారు. కూడా బ్యాటరీ లైట్లతో అన్నీ చూపించారు.

ఈ తాత్కాలిక సుఖాలు మనను తృప్తి పరుస్తాయా? అందుకే మనం 'బ్రహ్మైవాహమస్మి'అనే అనుభవం పొందాలి. అదే మన జీవిత గమ్యం. కేవలం శబ్దంతో తృప్తి పడకుండా 'నేను బ్రహ్మను అయి వున్నాను' అనే అనుభూతిని పొందాలి. భగవంతుని లీలామయమైన సృష్టిలో మనం జన్మించాం. కర్మలు చేస్తున్నాం. కర్మ వల్ల మళ్ళీ జన్మ వస్తుంది. సాధనలో మెల్ల మెల్లగా పైకి ఎగ బ్రాకుతూ, మనస్సును బ్రహ్మాకార వృత్తిలో ఉంచాలి. ద్వైతాన్ని నిరసించి ఏకత్వ భావన పొందాలి. పర్వదినాలలో వచ్చేదే పండుగ కాదు. ఇక్కడ మనమందరం ఈ విధంగా కలుసుకున్నాము. మన మనస్సులు ఏకాకార వృత్తి చెందాయి. ఇది మనకు పండుగే. ఎప్పుడైతే గోదాదేవి నారాయణమూర్తిని వివాహం చేసికొన్నదో, ఆరోజు భోగి అయింది. ఎప్పుడైతే విష్ణుమూర్తి బలి చకవర్తి తలపై కాలు మోపి పాతాళలోకానికి పంపి దాని సంరక్షణ భారం తాను

వహించాడో ఆ రోజు సంక్రాంతి అయింది. వీటికి అనుసంధానంగా ఋషుల చరిత్ర, కుల శేఖర ఆళ్వారుల ముకుందమాల, ద్వాపరయుగంనాటి రుక్మిణీ కళ్యాణ ప్రవచనాలు శ్రీగురుదేవులు ప్రసాదించారు. ఇవన్నీ ఒకే భగవత్తత్త్వాన్ని తెలుపుతున్నాయి.

మనం జీవభావంతో ఉంటే అది పండుగ ఎలా అవుతుంది? మనస్సు ఎప్పుడు పరమాత్మ దివ్యానుభూతిలో ఓలలాడుతుందో మన సాధన ఫలించిందన్నమాట. తానెవరో తాను తెలుసుకొని, తాను సర్వ వ్యాపకమైన బ్రహ్మయేగాని జీవ లక్షణాలు కలవాడుకాదు అనే అనుభూతి రావాలి. 'బ్రహ్మజ్ఞానికి ఒక దానిపైనే ఆశ' - అంటే మనందరిని ఆ స్థితికి చేర్చాలనేదే వారి ఆశ. అయనకు లేదు వినాశము. బ్రహ్మజ్ఞాని ఎటువంటివారో చెబుతున్నారు:

ఆయన వినయపూర్ణుడు;
ఆయన పరోపకారి, సంతోషి;
ఆయన చేయునదంతా మంచియే;
ఆయన సదా జాగరూకుడు, వారిది సుఫల ఫలము (ఆత్మ ఫలము);
ఆయన అహంకార త్యాగి.

ఇంతకీ ఒకటా, రెండా? నిద్రలో ఒక్కటే. మెలకువ రాగానే నానాత్వం కనిపిస్తుంది. అది అజ్ఞానం, జీవ లక్షణం. ఇంత ప్రకృతికి ఆధారమైన పరమాత్మ దివ్యానుభూతిని మనం పొందుతున్నామా? లేదా? ఇదంతా భగవంతుని ప్రజ్ఞ (లీల) అని గ్రహించాలి. మానవాళిని తరింపజేయటానికి 'తదేక్షత' - వారు అవతారం ధరించి వచ్చారు. మనందరిని ఉన్నతమైన స్థితికితీసుకువెళ్ళటం కోసం, మన సాధన ఇంకా ఇంకా పటిష్ఠమై నువ్వు పొందాల్సిన 'బ్రహ్మానుభూతి' పొందేదాకా మన చేయి వదలరు.

నువ్వు జీవభ్రాంతిలో కొట్టుమిట్టాడడానికి వీలులేదని ప్రబోధిస్తున్నారు. రెండు లేని ఏకపథంలో ఉన్నప్పుడు, ద్వంద్వం నీ మనస్సు తీసుకువస్తోంది. నిన్ను నీవు గుర్తించటం కోసం ఆవేదన చెందాలి. నువ్వు పొందాల్సింది బ్రహ్మానందం. అంటువంటి 'బ్రహ్మైవాహమస్మి' - బ్రహ్మ నేనై ఉన్నాను- అనే అనుభూతిని పొందాలి. తనను తాను గుర్తించటమే నిజమైన సాధన. అట్టి బ్రహ్మానందాన్ని శ్రీ గురుదేవులు మనందరికి ప్రసాదించెదరు గాక ! సుభీభవ!!

# నిజమైన బలం

- శ్రీ రమణ భగవాన్

పరమేశ్వరుడే సకల భారాలను భరిస్తున్నాడు. కాని నీవు 'నేను భరిస్తున్నాను' అని అనుకుంటున్నావు. నీ బాధ్యతలు, భారాలు, భగవంతునిపై వుంచి, నిశ్చింతగా వుండు. నీ వల్ల ఏ పని, ఏ సమయంలో జరుగవలసి వున్నదో, ఆ పని, ఆ సమయంలో, నీ చేత భగవంతుడు చేయించి తీరుతాడు. నీవు కేవలం పనిముట్టువి మాత్రమే! నీకు ఇచ్ఛ లేకపోయినంత మాత్రాన ఆ పని జరగదు అని అనుకోవద్దు. నీవు ఇచ్ఛించినంత మాత్రన బలం చేకూరదు. బలం భగవంతుడు!

భగవంతుడు సమష్టిగానే కాకుండా వ్యక్తిగతంగా ప్రతి ఒక్కరినీ వారి వారి స్వభావాన్ని అనుసరించి, భగవంతుణ్ణి గురించి వారికి గల అవగాహన, భక్తిని అనుసరించి, అనుక్షణం అనుగ్రహిస్తూనే వున్నాడు! రక్షిస్తూనే వున్నాడు!

నిజమైన భగవంతుని అనుగ్రహం అంటే మన మనస్సును అంతర్ముఖపరచి హృదయంలో స్థిరపడేటట్లు చేయడం !

ఒకసారి ఒక భక్తుడు 'భగవాన్! పదేళ్ళ నుండి వస్తున్నాను. నాలో అభివృద్ధి కనబడటం లేదు' అని మొర పెట్టుకున్నాడు.

' నా భక్తులు మొదటి తరగతి ప్రయాణీకులు. గార్డుతో చెప్పి నిశ్చింతగా పడుకుంటే చాలు. దిగవలసిన చోట గార్డేవచ్చి మేల్కొల్పుతాడు. అంతేగాని మాటిమాటికి దిగవలసిన చోటు వచ్చిందేమో అని బాధ పడనవసరం లేదు. గార్డుకు చెప్పడం వరకే మీ బాధ్యత' అన్నారు భగవాన్.

గురువుకు లేదా భగవంతునికి శరణాగతి చెందటమే ఉత్తమోత్తమమైన మార్గం.

# భగవంతుని సాన్నిధ్యంలో జనులు పవిత్రులవుతారు

- గాలి జగదీశ్

ఒక ఊరిలో ఒక దొంగ వుండేవాడు. ఒకసారి అతనికి ఎందుకో తీర్థయాత్రలకు వెళ్ళాలనే బుద్ధి పుట్టింది. ఒకరోజు తోటి యాత్రికులతో కలసి యాత్రకు బయలుదేరాడు. యాత్ర మధ్యలో రాత్రికి ఒకచోట బసచేయ వలసి వచ్చింది. అందరూ మంచి నిద్రలో వున్నారు. దొంగతనం చేయటం అలవాటు వున్నందువల్ల, అదును చూసి, కొన్ని బ్యాగ్‌లు తీసి అందులోని వస్తువులు కాజేయాలని చూశాడు. ఆ క్షేత్ర మహిమ వలన అతని మనస్సులో 'ఇటువంటి పవిత్ర స్థలంలో ఇలాంటి నీచ పనులు చేయరాదు' అని తలచి, తిరిగి ఆ బ్యాగ్‌లను వాటి వాటి స్థలంలో పెట్టడం జరుగుతుంది. కానీ ఎక్కడి నుంచి ఏది తీశాడో గుర్తులేక కొన్ని తారుమారు అయ్యాయి.

ఉదయం లేస్తూనే యాత్రికులంతా వారి వారి స్థానాలలో వారి బ్యాగ్‌లు లేకపోవటం గమనించి, కంగారు పడుతూ వుంటారు ఇలా ఎలా జరిగిందని! అప్పుడు ఈ దొంగ లేచి, జరిగినదంతా చెప్పి, క్షమించమని కోరతాడు. ఈ పవిత్ర ప్రదేశంలోకి వచ్చాక నా మనస్సు మారింది. ఇటువంటి పనులు చేయడం తప్పని తెలుసుకుని మీ మీ బ్యాగ్‌లు మీ స్థానాలలో తిరిగి పెట్టడంలో పొరపాటు జరిగింది అని అసలు విషయం చెబుతాడు. యాత్రికులంతా భగవంతుని మహిమ తెలుసుకుని సంతోషిస్తారు.

కాబట్టి పవిత్ర ప్రదేశాలలో భగవంతుని కృపవలన మనలో వున్న చెడు అలవాట్లు మాని, మంచి అలవాట్లు కలుగుతాయి. ఎప్పుడైతే ఆ దొంగవాని మనస్సులో ఇలాంటి మార్పు వచ్చిందో, అప్పుడే అతను పూర్వం చేసిన తప్పులన్నీ భగవంతుడు క్షమిస్తాడు. ఇప్పుడు అతనిలో భక్తి భావన కలగడం వలన సత్పురుషుడుగా మారి, దొంగతనాలు మానివేసి, సంఘంలో మంచి ప్రవర్తనతో జీవించసాగాడు. అందుకే మానవులు దేవాలయాలు సందర్శించి, భగవంతుని కృపకు పాత్రులై, వారిలో మంచి మంచి మార్పులు రావాలని యాత్రలు చేస్తారు.

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

**జూన్ 2019**

1 శని - శని త్రయోదశి; మాసశివరాత్రి

3 సోమ - అమావాస్య.

11 మంగళ - జ్యేష్ట శుద్ధ నవమి - సుగుణ ప్రసాద మాతాజీవారి ద్వాదశ వార్షికారాధన.

17 సోమ - జ్యేష్ట పౌర్ణమి - శ్రీసద్గురుపాదపూజ.

27 గురు - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

జూన్ 19 నుండి జూలై 12 వరకు శ్రీమాతాజీవారి అమెరికా పర్యటన.

**జులై 2019**

1 సోమ - మాస శివరాత్రి

2 మంగళ - అమావాస్య

12 శుక్ర - తొలిఏకాదశి - శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన, ఏకాహం సంకీర్తన.

16 మంగళ - ఆషాఢ పౌర్ణమి (గురు పౌర్ణమి) - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన. చంద్రగ్రహణం (రాత్రి 1-34ని॥ల నుండి తె.జా 4-30ని॥ వరకు.) చాతుర్మాస దీక్షా ప్రారంభము.

17 బుధ - దక్షిణాయణం ప్రారంభం.

27 శని - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

30 మంగళ - మాసశివరాత్రి

జులై 13 నుండి ఆగస్ట్ 1 వరకు శ్రీమాతాజీ యూరప్ పర్యటన.

# శ్రీ కృష్ణ కర్ణామృతము

- సుశీలా ప్రసాద

**ద్వితీయాశ్వాసము - 83 వ శ్లో॥**

**గోపాలజీ కర్దమే విహరసీ లీప్రాధ్వరే లజ్జసే ।**
**బ్రూషే గోకుల హుఙ్కృతేః స్తుతిశతైర్మౌనం విధ్యతే విరామ్ ।**
**దాస్యం గోకుల పుంశ్చలీషు కురుషే స్వామ్యం న దాన్తాత్మసు ।**
**జ్ఞాతం కృష్ణత హిఙపఙ్కజ యుగం ప్రేమాచలం మంజులమ్ ॥**

**తాత్పర్యము -**

కృష్ణా! గొల్ల యిళ్ళ ముంగిళ్ళ బురదలయందు ఆడెదవు, బ్రాహ్మణుల యజ్ఞములలో బోవ సిగ్గుపడుదువు. ఆవుల రంకెలతో మారు పలికెదవు, పండితుల యొక్క స్తోత్రశతములచేత మౌనమును పూనెదవు. గోపికలకి దాస్యము చేయుదువు, శాంతచిత్తుల యెడ ప్రాభవమును చేయవు. ఓ కృష్ణా! నీ పోబడి తెలిసినదిలే. నీ అందమైన అడుగుదామరల జంట అనురాగముచే అవలోకమైనది. నీకెక్కడ ప్రేమయున్నదో అక్కడికేగెదవుగాని హెచ్చుతగ్గులు నీకు లేవు. నీకు సర్వ సమర్పణ చేసుకున్న హృదయమే నీ నిలయము.



## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా, జూన్2019, జులై 2019 మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

***జూన్ 2019*** - AS 6868, 7471-7475, 7477-7481, 7778, 7780, 7796.

***జులై 2019 -*** AS 3728, 5744, 5916, 6405, 6587, 6872, 6875, 6888, 6894, 6936, 7514, 7786, 7787

- మేనేజరు

# పరిప్రశ్న

- పరాశర ప్రసాద్

ప్రతిరోజూ రాత్రి సత్సంగాలలో ఏదో ఒక సందేహాన్ని సద్గురుదేవుల సమక్షంలో లేవనెత్తితే దానికి సంబంధించిన చక్కని బోధను అందజేసేవారు. ఆనాటి సత్సంగంలో ఒక భక్తుడు తన సందేహాన్ని వెలిబుచ్చుతూ '**సర్వ ధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ। అహం త్వాం సర్వపాపేభ్యో మోక్ష యిష్యామి మాశుచః ॥**' అని భగవద్గీతలో శ్రీకృష్ణ



భగవానుడు శెలవిచ్చాడు కదా! మరి సృష్టిలో మానవులంతా వారి వారి ధర్మాలను విడనాడి, భగవంతుని సన్నిధిలో కూర్చుంటే, భగవంతునిచే సృష్టించబడిన జగత్తు యొక్క స్థితి ఏమిటి?' అని అడిగాడు.

శ్రీ సద్గురుదేవులు మాట్లాడుతూ, "ఎట్టి పరిస్థితులలోనైనా నీ దేహము నిర్వహించే ధర్మాలని త్యజించి ఉండగలవా? ఆకలి వేసినప్పుడు తినకుండా ఉండగలవారెవరైనా వున్నారా? పోనీ శ్వాసించటం మానేయగలవారెవరైనా వున్నారా? అంతేకాదు నీ దేహంలో గల అవయవాలు పని చేయకుండా ఆపివేయగల శక్తి నీకున్నదా? ఇవన్నీ దేహ ధర్మాలు. ఇంకా దేహాన్ని ప్రకాశింపజేసే దేహికి ఏమైనా ధర్మాలు వున్నాయా? పోనీ గుణాలని ఆపాదిస్తావా? అది సత్యమైనది, నిత్యమైనది.

మరి శ్రీకృష్ణభగవానుడు త్యజించమన్న ధర్మాలు ఏవి? ఆ ధర్మాలను ఆచరింపజేసేది ఏది? దానిని విచారణ చేయండి. విచారణ ద్వారా విషయం అవగాహన అవుతుంది. మానవుడు కొన్ని నిత్య నైమిత్తిక కర్మల ద్వారా పుణ్యపాపములను ఆర్జిస్తున్నాడు. ప్రతి కార్యానికి ఫలితం వుంటుంది. అది మంచిది కావచ్చు, లేదా చెడు కావచ్చు. పుణ్యఫలం కోసం యజ్ఞయాగాదులు, ఇంకా అనేక సత్కర్మలు చేయవచ్చు. అవి దేవతలకు ప్రీతి కలిగించవచ్చు. వారి పరమానుగ్రహం ద్వారా పుణ్య ఫలాన్ని ఆర్జించటమే కాక, ఉత్తమ జన్మ లభించవచ్చు. ఆ ఫలము ఆశాశ్వతమైనది, తాత్కాలికమైనది.

మానవుడు కోరే ప్రాపంచిక పుణ్య ఫలాల కన్న, అత్యంత ఆనంద దాయకమైన మోక్ష ఫలమును మానవుడు ఆచరించే పుణ్య కర్మల ద్వారాగాని, లేదా దేవతల ద్వారాగాని పొందలేడు. మోక్ష ఫలాన్ని పొందాలంటే మానవుడి మనస్సు సంకల్ప రహితమవ్వాలి. అప్పుడే బంధ విముక్తి. అందువలననే శ్రీకృష్ణుడు అర్జునుని ఉద్దేశిస్తూ భక్తులందరికీ తన సందేశాన్ని అందజేశాడు.

సమస్త దేవతలకు ప్రీతి కలిగించే పుణ్య కార్యాలన్నింటినీ సర్వ ధర్మాలను త్యజించి, సర్వ దేవతలకు అధినేత అయిన జగద్గురువును ఆశ్రయించి, కర్మణా, మనసా, వాచా సంపూర్ణ శరణాగతిని పొందినప్పుడు, జీవుడు ఆచరించిన సమస్త పాపముల నుండి బంధ విముక్తుణ్ణిచేసి, మోక్షాన్ని ప్రసాదించి, శోక విముక్తుణ్ణి చేస్తానని హామీ ఇచ్చాడు.

గోచరించే అశాశ్వతమైన వాటి యందు మోహము, దృశ్య భావన త్యజించాలి. అవాఙ్మానస గోచరమైన ఆత్మ వస్తువునే ఆచరించాలి. విశ్వసించాలి. ఏ కార్యం ఆచరించినా భగవద్భావము, సేవా దృక్పథంతో చేయాలి.

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

**జూన్ 2019**

17 సోమ - జ్యేష్ట పౌర్ణమి - సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

27 గురు - శ్రీగురుదశమి - సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

**జులై 2019**

12 శుక్ర - తొలిఏకాదశి -సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

16 మంగళ - ఆషాఢ పౌర్ణమి (గురు పౌర్ణమి) - సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ.

27 శని - శ్రీగురుదశమి - సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ.

# అనుభవ జ్ఞానం - పాలూరి కాళీప్రసాద్

మనం సాధారణంగా పాఠశాలలో చూస్తూ వుంటాం - సరిగ్గా చదువు రానివాళ్లను, చెప్పిన పాఠం అర్థం చేసుకోలేనివాళ్లను, 'శుద్ధ మొద్దు అవతారం! నువ్వు జీవితంలో ఎందుకు పనికివస్తావు?' అంటూ వుంటారు.

అయితే చదువు జీవితంలో ఒక భాగమేకానీ, చదువే జీవితం కాదని మనకందరికీ తెలిసిన విషయమే కదా! కేవలం పుస్తకంలో వున్నది బట్టీపట్టో, అర్థం చేసుకునో, అడగగానే సమాధానాలు చెప్పగలిగేవాడి కంటే, సమాజాన్ని చదివి, ఎలా జీవించాలో, ఎప్పుడు ఎలా ప్రవర్తించాలో, అవకాశాలు ఎలా అందిపుచ్చుకోవాలో, అవి లేనప్పుడు వాటిని ఎలా కల్పించుకోవాలో అనుభవం ద్వారా తెలుసుకున్నవాడే జీవితంలో ఎక్కువగా రాణించగలుగుతాడు. కేవలం పుస్తకాలే జీవితంగా బ్రతికిన వాడి ఫొటో ఒక్కసారి పేపర్లో పడినా, ఆ తరువాత ఎలా జీవించాలో తెలియకపోతే, వాడు చాలా అతి సామాన్యమైన జీవితాన్నే గడపవచ్చు. చదువు వంటబట్టక పరీక్షలు తప్పినవాడు కూడా ఎలా జీవించాలో తెలిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చు. మనకు తెలిసిన ఎందరో కోటీశ్వరులు సరియైన చదువులేనివారే, కానీ జీవితాన్ని చదివినవారు.

ఇదే సూత్రం ఆధ్యాత్మికంలో కూడా వర్తిస్తుంది. భగవంతుడు ఒక్కొక్కరికి, ఒక్కొక్క రకమైన శక్తిని ఇస్తాడు. మనమందరమూ ఆయన చేతిలో పనిముట్లమే. ఏ పనిముట్టు ఎందుకు పనికి వస్తుందో, దానిని ఎలా ఉపయోగించుకోవాలో ఆయనకు బాగా తెలుసు. ఒకరు చక్కగా పాడగలుగుతారు. మరొకరు చక్కగా వ్రాయుటమో వేదికలెక్కి ఉపన్యాసాలు చెప్పడమో చేయగలుగుతారు. మరొకరు ఎంతటి లోతైన వేదాంత విషయాలనైనా సులభంగా అర్థం చేసుకుని, గుర్తుపెట్టుకుని, మళ్లీ తిరిగి చెప్పగలుగుతారు. అంతమాత్రం చేత వారంతా ఏదో సాధించేశారనో, ఇవేవీ చేయలేనివారు ఎందుకూ పనికిరాని వారనో అర్థం కాదు. అనుభవ జ్ఞానం ముందు, పుస్తక జ్ఞానం, పాండిత్యం ఎప్పటికీ దిగదుడుపే. పంచభూతాలు, దశేంద్రియాలు, పంచ తన్మాత్రలు, షట్చక్రాలు, గుణత్రయం, వాసనాత్రయం, ఈషణత్రయం, సాధన చతుష్టయం ఇలా టకాటకా అన్నీ అప్పజెప్పే వ్యక్తి తనలో ఏదైనా గుణం ప్రేరేపించినప్పుడు ఎంతవరకు తట్టుకుని నిలబడగలుగుతాడో ఎవరైనా గ్యారంటీ ఇవ్వగలరా? అదే ఇవేమీ తెలియకపోయినా నిరంతరం భగవన్నామం

చేసుకుంటూ తనకు జీవితంలో వచ్చే కష్టసుఖాలన్నింటినీ సమదృష్టితో భగవంతుని ప్రసాదంగా స్వీకరించే భక్తుడు తప్పక నిలబడగలుగుతాడు. కాబట్టి ఇక్కడ శాస్త్రజ్ఞానం కన్నా అనుభవ జ్ఞానమే మిన్న కదా!

పుస్తక జ్ఞానం, లేదా శాస్త్రజ్ఞానం ఒక జన్మకే పరిమితమైనది. మరి మన ఆధ్యాత్మిక సాధన జన్మజన్మాంతరాల నుంచీ జరుగుతూనే వుంది. 'సాధన మార్గంలో వున్న మానవుడు కర్మవశం చేత మధ్యలోనే జన్మ చాలించవలసి వస్తే, అతని సాధన అంతా వృథాయేనా? అని భగవద్గీతలో అర్జునుడు వెలిబుచ్చిన సందేహానికి గీతాచార్యుడు 'అటువంటి భయమేమీ అక్కరలేదు. ఒక జన్మలో సాధన పూర్తికాక యోగభ్రష్టుడైన సాధకుడు ఎక్కడైతే తన సాధన ఆపాడో, ఆ తరువాత జన్మలో అక్కడ నుండి తన సాధన కొనసాగించి, చివరకు కృతకృత్యుడవుతాడు' అని భరోసా ఇచ్చాడు కదా! మరి ఇదే సూత్రం పుస్తక జ్ఞానానికి వర్తిస్తుందా? ఈ జన్మలో డిగ్రీ చదువుకున్న మానవుడు, వచ్చే జన్మలో నేరుగా పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేస్తానంటే కుదురుతుందా? మళ్ళీ అతను ఆ జన్మలో నర్సరీ నుండి మొదలు పెట్టవలసినదే కదా!

శాస్త్రజ్ఞానంతో మనం భగవంతుని మెప్పించలేము. ఎవరైనా మనకు తెలియని విద్యను ప్రదర్శిస్తేనే మనం అబ్బుర పడతాం. మరి ఈ లోకంలోని పుస్తక జ్ఞానమంతా భగవంతుని నుండి వచ్చినదేకదా. ఇందులో ఆయనకు తెలియనిది, ఆయనను అబ్బురపరచేది ఏముంటుంది? కాని ఆయనకు తెలియనిది, అనుభవంలోలేనిది ఒకటి వుంది. అదే భక్తి. ఆ భక్తితో మనం ఆయన హృదయాన్ని గెలవవచ్చు. 'ఎందరో భక్తులు నా మీద ఇంతటి ప్రేమను చూపిస్తున్నారు. నన్ను చూడకుండా, సేవించకుండా వుండలేక పోతున్నారు. అసలు ఈ భక్తి, ప్రేమ ఎలా వుంటాయో చూడాలనే వుత్సుకతతో శ్రీకృష్ణుడు తానే రాధ రూపాన్ని ధరించి భక్తిని అనుభవ పూర్వకంగా తెలుసుకున్నాడనీ, అలాగే అసలు ఈ పాదాలలో వున్న మాధుర్యమేమిటో అని ఆయన సృష్టి అంతా లయమైపోయిన తరువాత వటపత్రశాయియై తన కాలి బొటనవ్రేలుని తనే నోట్లో పెట్టుకుని ఆస్వాదిస్తూ వుంటాడని కూడా చెబుతారు. కాబట్టి నిజంగా భగవంతుని మెప్పించేది భక్తి, అనుభవ జ్ఞానమేకాని, శాస్త్రజ్ఞానము కాదు.

(గత సంచిక తరువాయి)

# కైవల్యోపనిషత్

- రేఖ

ఇంతకుముందే భగవంతుడి నిర్గుణతత్త్వాన్ని చెప్పి, బ్రహ్మదేవుడు ఇప్పుడు సగుణరూప ధ్యానం గురించి చెబుతున్నాడు అశ్వలాయన మహర్షికి. ఉమతో కూడినవాడు, ప్రభువు, త్రిలోచనుడు, నీలకంఠుడు అయిన ఆ పరమేశ్వరుడిని ధ్యానించి, ముని అయినవాడు ప్రపంచ సృష్టికి కారణమై పెను చీకటి కవ్వలనుండు సర్వసాక్షిని చేరుతున్నాడు.

ఒకేసారి నిర్గుణతత్త్వం బోధ విని ధ్యానం చేయడానికి ప్రయత్నిస్తే అది కొంచెం కష్టతరమవుతుంది. ఆ ఉన్నత స్థితిని పొందటం కూడా కష్టమే. భగవంతుని సగుణరూప ధ్యానం కొంత సులభమైన ప్రక్రియ అని, మనకి మహాత్ములు సగుణరూపాన్ని ధ్యానించమని తెలిపారు.

ఆరాధ్యదైవమైన పరమేశ్వరుడు ఉమతో కూడిన ప్రభువు ప్రశాంత స్వరూపం కలవాడు. జ్ఞాననేత్రంతో కూడి మూడు నేత్రములు కలవాడు (త్రిలోచనుడు). నీలకంఠుడు - క్షీరసాగర మథన సమయంలో కంఠంలో గరళాన్ని నింపుకున్నవాడు, సమస్త దృశ్య జగత్తుకు, భూతములకూ కారణమైనవాడు, సమస్తమునకు సాక్షియైన వాడు అంటే లోకంబులు, లోకేశులు, లోకస్థులు, తెగిన తుది నలోకంబగు పెంజీకటి కావల ఎవరు ప్రకాశిస్తున్నారో వానిని ముని (మననశీలుడు) చేరుతున్నాడు. ఈ విధంగా మనసు సగుణరూపంపై లగ్నమయి, స్థిరపడినప్పుడు బుద్ధి ఆ విగ్రహం వెనుక వున్న భావాన్ని గ్రహించి, అందులో ధ్యానించ గలుగుతుంది. అలా సగుణరూప అర్థాన్ని సాధకుడు గ్రహిస్తే, దృశ్యప్రపంచానికి కారణమైన పరమాత్మను తప్పక చేరుకుంటాడు.

మనమందరమూ కైవల్యోపనిషత్తులో వున్నామా? లేక కైవల్యంలో వున్నామా? మనం కైవల్యంలోనే వున్నాము. కేవలం ఆ స్థితిలోనే వున్నాము. దేనిని పొందితే ఇక పొందవలసినది లేదో ఆ స్థితిలోనే వున్నాం. అదే ఆత్మస్థితి అని గుర్తిస్తే తెలుసుకున్నవార మవుతాము" అన్నారు శ్రీ మాతాజీ.

- సశేషం

# సమర్థ సద్గురు నాధుని దివ్య చరిత్ర

## బళ్ళారి శాస్త్రిగారితో శ్రీబాబు

- విజయేశ్వరానంద ప్రసాద్

పరోపకార చింతనులైన శాస్త్రిగారితో శ్రీ బాబు భక్తులెందరి పిల్లలకో బ్యాంకు ఉద్యోగాలు యిప్పించారు. ఆశ్రమంలో వైశ్యాబ్యాంకు ఎక్స్‌టెన్షన్ కౌంటరును శాస్త్రిగారి ప్రోత్సాహంతోనే శ్రీ బాబు ప్రారంభించారు.

దేహంతో అనుభవించవలసిన ప్రారబ్ధము ఎంతటి వారికైనా తప్పనిదే. శాస్త్రిగారు రక్తపోటుతో వ్యాధి గ్రస్థులైనారు. కాని పరమ దయాసింధువైన శ్రీబాబు శాస్త్రిగారికి దేహ విలక్షణత్వాన్ని అనుభవంలో ప్రసాదించి, తమ అన్నగారిని విదేహముక్త స్థితిలో నిలిపారు. వ్యాధితో మంచం పట్టిన క్షణం నుండి శాస్త్రిగారి నోటి వెంట **'అహమేవాహం మాం జుహోమి స్వాహా'** అనే ఉపనిషద్వాక్యం మాత్రమే గాని, మరొక శబ్దం వెలువడేది కాదు. ఆకలని గాని, దాహమని గాని అడిగేవారు కాదు. ఏదైనా ఆహారం గాని, పానీయం గాని నోటికి అందిస్తే తీసుకొనే వారు. లేకపోతే మౌనమే. ఎవరైనా 'శాస్త్రిగారూ!' అని పిలిస్తే **'అహమేవాహం మాం జుహోమి స్వాహా'** అనేవారు.



అలాగని శాస్త్రిగారు స్పృహలో లేరనుకోవటానికి వీలుండేది కాదు. ఒకసారి వైశ్యాబ్యాంకు వారు, సమయం పూర్తి అయిన డిపాజిట్ కాగితమును తెచ్చి 'శాస్త్రిగారూ! ఈ కాగితం మీద మీ సంతకం కావాలి' అని అడిగారు. శాస్త్రిగారు లేచి కూర్చుని చక్కగా, తాము సర్వీసులో వున్నపుడు ఎలా సంతకం చేసేవారో , అలాగే సంతకం చేసి యిచ్చారు. ప్రక్కనున్న భక్తులొకరు 'ఓహో! శాస్త్రిగారు మీరేనా?' అనేసరికి, తల అడ్డంగా ఊపుతూ **'సర్వోపప్లవ రహిత:, ప్రజ్ఞాన ఘన:, ప్రత్యగర్థో బ్రహ్మైవాహమస్మి, బ్రహ్మైవాహమస్మి'** అన్నారు.

ఒకసారి శాస్త్రిగారి మునిమనుమడు పవన్ కుమార్ (4 సం॥లు) వారి దగ్గరకు వచ్చి బిగ్గరగా **'అహమేవాహం'** అన్నాడు. వెంటనే

శాస్త్రిగారు **'మాం జుహోమి స్వాహా'** అన్నారు. 'అంటే ఏమిటి తాతయ్యా?' అని పవన్ అడిగాడు. శాస్త్రిగారు బోసినోటితో పక పకా నవ్వుతూ 'అంటే గారెలు తినటం' అన్నారు. సుమారు మూడు సంవత్సరాలు యిలా మంచంలోనే ఉన్న శాస్త్రిగారు అదే ఉపనిషద్వాక్య స్మరణతో 28-1- 1986 రోజున బ్రహ్మైక్యం పొందారు.

శ్రీ బాబు ఆ రోజున జరిగిన సమావేశంలో శాస్త్రిగారిని గురించి చెబుతూ "శాస్త్రిగారి మనస్సును 1065 రోజులపాటు అనన్య చింతనతో ఆత్మ నిష్ఠలో నిలిపి, ఆగామి, సంచిత, ప్రారబ్ధ కర్మ బీజములన్నిటిని ఆత్మ జ్ఞానాగ్నిలో భస్మం చేయించి, పునరావృత్తి రహితమైన కైవల్య స్థితిని ప్రసాదించి, స్వస్వరూప లయం పొందించింది జగన్మాత " అన్నారు.

తమ కుటుంబంలో పిల్లలను పెద్దలను తమ వలెనే గురుసేవలో నిలిపి నిజమైన కుటుంబ యజమాని అనిపించుకున్నారు శాస్త్రిగారు. శాస్త్రిగారి తల్లిగారు కూడ పూర్ణ దీక్షను పొందిన వారు. వారు ఆశ్రమ నివాసంలోనే తమ జన్మను సార్థకం చేసుకొని 1977లో బ్రహ్మైక్యం పొందారు. శాస్త్రిగారి సతీమణి సుబ్బలక్ష్మమ్మగారు తమ జీవితమంతా పతిసేవలోను, అతిథి సేవలోను, గురు స్మరణలోను పునీతం చేసుకున్నారు. శ్రీబాబు శాస్త్రిగారింటికి ఎన్నోసార్లు వెళ్ళారు. సుబ్బలక్ష్మమ్మగారు గురుదేవులను సేవించుకున్న తీరుకు సంతోషించి, శ్రీబాబు ఆమెను 'అన్నపూర్ణమ్మ తల్లి' అని అభిమానంగా పిలిచే వారు. ఆమె కూడ పూర్ణ దీక్షితురాలే. తమ శేషజీవితాన్ని క్షణమైనా వ్యర్థం చేయక, ఆశ్రమ ప్రాంగణం దాటననే నియమాన్ని పాటించి, ఆశ్రమంలో అన్ని కార్యక్రమాలలోను, సేవలలోను పాల్గొని చరితార్థ జన్ములై 1997లో బ్రహ్మైక్యం పొందారు.

**ఆర్ద్రం జ్వలతి జ్యోతిరహమస్మి।**
**జ్యోతిర్జ్వలతి బ్రహ్మాహమస్మి।**
**యోఽ హమస్మి బ్రహ్మాహమస్మి।**
**అహమస్మి బ్రహ్మాహమస్మి।**
**అహమేవాహం మాం జుహోమి స్వాహా॥**

## శ్రీమాతాజీవారి విదేశ పర్యటన కార్యక్రమాలు

**జూన్ 2019**

16న ఆశ్రమం నుండి బయలుదేరి ఢిల్లీ చేరుతారు. శ్రీమాతాజీతో రాజా శివానంద్, శ్రీమతి పద్మగార్లు ప్రయాణిస్తారు. (సెల్:8008000969)

19 ఢిల్లీ నుండి బయలుదేరి, అమెరికా డెట్రాయిట్ చేరి బాబు, వెంకటలక్ష్మి గృహంలో వుంటారు. (సెల్:1-248-895-0511).

అక్కడనుండి నార్టన్‌షోర్స్ చేరి, డా. అరుణ. కిషన్ గారి వద్ద ఉంటారు అరుణ (సెల్: + 1-314- 825-3102).

28 షాంపైన్ (ఇలినోయిస్)కు వెళ్ళి అక్కడనుండి సైంట్‌లూయిస్ (మిస్సోరి) చేరుతారు. డా॥కురుచేటి ప్రసాద్ - 0013149936212.

జూలై 2019

01 వాషింగ్‌టన్( వర్జీనియా) చేరి, శ్రీ కాళీ ప్రసాద్ నూనె, శ్రీమతి అలేఖ్య దంపతుల గృహంలో (సెల్: + 1-267-357-7956)ఉంటారు.

04-7-2019 నుండి 07-07-2019 వరకు సత్సంగం.

04-07-2019న శ్రీనూనె కాళీ ప్రసాద్. అలేఖ్య దంపతులచేత త్రయాహ్నిక దీక్ష ప్రారంభింపజేస్తారు. అమెరికాలోని వివిధ ప్రాంతాలనుండి భక్తులు అక్కడకు వచ్చి ఈ కార్యక్రమాలలో పాల్గొంటారు.

07-07-2019న దీక్షా విరమణ, మహామంగళహారతితో అక్కడ కార్యక్రమాలు ముగుస్తాయి.

08 శ్రీశ్రీనివాస ప్రసాద్ దుగ్గిరాల, శ్రీమతి పద్మ దంపతుల గృహంలో వుంటారు (సెల్:001-404-509-9597).

10 బోస్టన్ చేరుతారు. అక్కడ అన్నం బాబు ప్రసాద్ గారి వద్ద వుంటారు. (సెల్ నెం. 001(732)986-7587)

12 అమెరికా నుండి బయలుదేరి

13-7-2019న నార్వే చేరుతారు. శేషప్రసాద్, శ్రీమతి గీత దంపతుల గృహంలో కార్యక్రమాలు జరుగుతాయి. సెల్ 004745282464

16 - గురుపూర్ణిమ నాడు శ్రీ సద్గురు పాదపూజ జరుగుతుంది.

18 అమ్‌స్టర్‌డామ్ (నెదర్‌లేండ్స్) చేరి అక్కడ కరుణాకర చరణ్, జ్యోత్స్న, మరియు ఆదిత్య, రాజీ గార్లు శ్రీమాతాజీ వద్ద ఉంటారు. సెల్ - 0031687448929. శ్రీ కుమారస్వామి రాజా, కోమలి దంపతులు

కూడా శ్రీ మాతాజీతో ప్రయాణం చేస్తారు.
21 - లండన్ చేరుతారు. తవ్వా ప్రసాద్‌గారింట్లో వుంటారు.
22 - లండన్ నుండి స్కాట్‌లాండ్ చేరి శ్రీ కాళీచరణ్, ప్రసన్న దంపతుల గృహంలో (సెల్: 07738226l771)ఉంటారు.
25 లండన్ చేరి,శ్రీ తవ్వా ప్రసాద్ దంపతుల గృహం చేరుకొంటారు (సెల్ నెం. 07990523652)
27 - సెంట్ జాన్ విలేజ్ మెమోరియల్ హాల్, సెంట్ జాన్ లై, సెంట్‌జాన్స్ వోకింగ్‌లో సామూహిక శ్రీ సత్యన్నారాయణ వ్రతం, కుంకుమపూజలు జరుగుతాయి.
28 - 30 వరకు త్రయాహ్నిక దీక్షతో సత్సంగ కార్యక్రమాలు ఉంటాయి.
30 - దీక్షా విరమణ, మహా మంగళహారతి.
31శ్రీమాతాజీ వారు బయలుదేరి. 1-8-2019న ఢిల్లీ చేరుతారు.

## సగుణం నిర్గుణం

సగుణారాధన మనకు చాలా తేలికగా లభిస్తుంది. భగవంతుని నిర్గుణసౌందర్యం అందుకోవటం కొంచెం కష్టమే అనిపిస్తుంది. కానీ, ఎప్పుడూ సగుణంలోనే వుండిపోకూడదని, ఎప్పటికైనా నిర్గుణానికి ఎదగాలని, అప్పుడే శాశ్వతానందాన్ని పొందగలరని శ్రీగురుదేవులు చెప్పేవారు కదా! ఎందుకంటే సగుణానికి ఎప్పుడూ ఒక భౌతిక పరిమితి వుంటుంది. నిర్గుణానికి ఎటువంటి పరిమితులు వుండవు.

పోతనమహాత్ముడు లోకంబులు, లోకస్థులు, లోకేశులు తెగిన తుదినలోకంబగు పెంజీకటికవ్వల ఏకాకృతిగా వెలిగే నిర్గుణ పరబ్రహ్మాన్ని దర్శించగలిగాడు. లోకాలన్నీ దాటి పెంజీకటిని చేరుకోవాలంటే కాంతి వేగంతో ప్రయాణిస్తే, ఎన్నో లక్షల సంవత్సరాలు పడుతుందని బాబూజీ మహరాజ్ చెప్పేవారు. మరి అంత దూరాన్ని కేవలం క్షణమాత్రంలో తన మనస్సుతో దాటి ఆ నిర్గుణ సౌందర్యాన్ని అందుకోగలిగిన పోతనగారే సగుణానికి వచ్చేసరికి ‘అల వైకుంఠ పురంబులో నగరిలో ఆమూల సౌధంబు దాపల .....’ అని ఆగిపోయారు. అదే సగుణానికి వున్న పరిమితి. ఆ తరువాత ఏమున్నదో ఆ స్వామియే దిగివచ్చి వ్రాయవలసి వచ్చింది.

- పాలూరి ప్రసాద్

(గత సంచిక తరువాయి) విష్ణు  కథలు - రమణ ప్రసాద్

# శ్రీ స్వామి వివేకానంద

"శ్రీరామకృష్ణుల అవసాన దశలో నేను ఆయన మంచం ప్రక్కన నిలబడి నాలో నేను అనుకున్నాను. "సరే ఇప్పుడైనా మీరు భగవంతుడినని ప్రకటించుకుంటే, ఆ తర్వాత మాత్రమే మీరు సాక్షాత్తు భగంతుడని విశ్వసిస్తాను." ఇది ఆయన మహాసమాధికి రెండు రోజులముందు జరిగింది. తక్షణవే ఆయున నావంక చూస్తూ హఠాత్తుగా ఇలా అన్నారు "ఎవడు రాముడో, ఎవడు కృష్ణుడో వాడే ఇప్పుడు రామకృష్ణుడుగా ఈ శరీరంలో ఉన్నాడు. కాని నీ వేదాంత దృక్పధంతో కాదు' ఆ మాట విని నేను అవాక్కయ్యాను"వాస్తవం ఏమిటంటే శ్రీరామకృష్ణులు ఎవరో ఏమిటో సామాన్యులైన అమాయకులకు అంతుపట్టదు. అయన ఒక్క కృపా వీక్షణంవల్ల వేలాది వివేకానందులు ఉద్భవిస్తారు. కాని, ఆయన అలా చేయకుండా తన పనులు నిర్వర్తించటానికి నన్ను ఏకైక పరికరంగా ఎన్నుకున్నారు."



"గురుదేవులు నిర్యాణం చెందే విచారకరమైన రోజు రానే వచ్చింది. మా పరిపూర్ణ భక్తితో సేవా శుశ్రూషలు చేశాం. మేము పన్నెండు మంది బాలురం అతి విస్తృత మహోన్నత ఆశయాలతో మా జీవితాలను గడుపుతూ వారి ఆశయాలను ఆచరణలో పెట్టడానికి కృత నిశ్చయులై ఉన్నాము."

"శ్రీరామకృష్ణుల నిర్యాణానంతరము బారానగర్ మఠంలో ఎన్నో పారమార్ధిక సాధనలు అనుష్టించాం. ఆహా! ఆ రోజుల్లో ఎంత బలీయమైన వైరాగ్యస్ఫూర్తి ఉండేదో కదా! రామకృష్ణానంద మా భోజనం సిద్ధం చేసి జపధ్యానాల నుంచి బలవంతంగా లాగి తినిపించేవాడు."

"మేం సాధువులం భిక్షాటనవల్లా, అటువంటి ఇతర విధానాలవల్ల ఏది లభిస్తే దానితో మఠ నిర్వహణకు అయ్యే ఖర్చులు భరించేవాళ్ళం. బారానగర్

ఖర్చులన్నీ సురేశ్‌బాబు (సురేంద్రనాధ్ మిత్ర) భరించేవాడు. అతడి భక్తి విశ్వాసాలు సాటిలేనివి.

రామకృష్ణానంద మఠానికి మూలస్తంభం. ఒక్కొక్కసారి నెల పొడుగునా అన్నం, ఉప్పు, దొండాకుకూర-ఇదే మా భోజన పట్టిక. శ్రీరామకృష్ణుల నిర్యాణానంతరం చింకి గుడ్డలు ధరించిన మమ్ము నిరర్ధకులుగా అందరూ వదిలేసినప్పుడు సురేశ్, మాస్టర్ (మహేంద్రనాధ్ గుప్తా) భునిబాబు (భునీలాల్‌బసు) ఆ అక్కర సమయంలో మమ్ము ఆదుకున్న మిత్రులు. వారి ఋణాన్ని ఏనాటికీ తీర్చుకోలేం."

"ఇలా కొన్ని సంవత్సరాలు గడిపాం. భారతదేశంలో నలుమూలలకు వెళ్ళి మా భావాలను క్రమంగా వ్యాప్తిచేస్తూ పర్యటించాం. పదేళ్ళుగడిచాయి. "రాజీపడరాదు" అన్నదే మా తారకమంత్రం. నా ఆరోగ్యం చెడడం ప్రారంభించింది."

"నాకొక నమ్మకం ఉంది. అది ఇప్పటికీ ఉంది. నేను సన్యసించి ఉండకపోతే, ఏ మహోన్నత సందేశాన్ని భోధింప మా గురువులైన శ్రీ రామకృష్ణ పరమహంస అవతరించారో, ఆ ఉద్యమం వెలుగు చూసేది కాదు. అంతే కాక నేడు ప్రాపంచిక, సుఖోపభోగాలనే ఉవ్వెత్తుగా లేస్తున్న తరంగాలకు అడ్డు గోడలుగా నిలబడ్డ ఆ యువకులు ఏమై ఉండేవారు? వీరు భారతదేశానికి ఎనలేని మేలు చేశారు. కోట్లాది జనులపట్ల ఉన్న నా ప్రేమానురాగాలు, భారతదేశ ఆధ్యాత్మిక భవిత, యావత్ప్రపంచ భవిష్యత్తు ఇది ఒకవైపు, రెండవ వైపు దీనావస్థలో ఉన్న నా సన్నిహితులు, ఆప్తులు. ఈ రెండిటిలో నేను మొదటి దాన్ని ఎన్నుకున్నాను. తక్కినవి భగవంతుడే నిర్వర్తిస్తాడు. భగవంతుడు నాకు అండగా ఉన్నాడు. ఇది నాకు ఖచ్చితంగా తెలుసు."

-సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL